thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 155 | జగిత్యాల బుధవారం 09 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

**మంధాన మరో మైలురాయి..**




11




## టీచర్ల నియామకాల్లో అర్హతలేనివారికి 'నో ఎంట్రీ'

- సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు స్ప నిర్దేశిత అర్హతలు తప్పనిసరి
- విలీనం పేరుతో నిబంధనలు పక్కన పెట్టొద్దు
- విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యమన్న ధర్మాసనం

4

## ఐక్యరాజ్యసమితి కొత్త మ్యాప్

ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నూతన ప్రపంచ పటం భారత్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాల సరిహద్దుల విషయంలో భారత, చైనా దేశాల వాదనలకు అనుగుణంగా వేర్వేరు గీతలను (ఇండియన్ లైన్, చైనీస్ లైన్) చూపించడం వివాదానికి దారితీసింది.




4



# ఎర్రవల్లిలో హైటెన్షన్



## కేసీఆర్ హత్యకు కుట్ర.. భద్రత కల్పించాలి

- కేసీఆర్ రక్షణ ప్రభుత్వ బాధ్యతే: కేటీఆర్
- పోలీసులపై నమ్మకం లేదంటూ వ్యాఖ్యలు
- ఎర్రవల్లి వెళ్తున్న కేటీఆర్, హరీశ్ అరెస్ట్
- కాంగ్రెస్ శ్రేణులను ఎందుకు అడ్డుకోలేదని నిలదీత
- బోయిన్‌పల్లి పీఎస్ వద్ద బీఆర్ఎస్-కాంగ్రెస్ ఘర్షణ

3

- కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి యత్నం
- డప్పుల మోతతో తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- అరకిలోమీటరు దూరంలోనే అడ్డుకున్న పోలీసులు
- బారికేడ్లు దాటే యత్నం.. తోపులాట
- ఎర్రవల్లి బయలుదేరిన కేటీఆర్, హరీశ్ అరెస్ట్
- రెండున్నర గంటలపాటు తీవ్ర ఉద్రిక్తత

శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ దళిత విభాగం, దళిత సంఘాలు ఇచ్చిన పిలుపుతో సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. వెయ్యి మంది డప్పు కళాకారులతో ఫామ్‌హౌస్‌ను ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు వేలాదిగా తరలిరావడంతో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. నిరసనకారులు బారికేడ్లను తోసుకుని ముందుకు వెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు, కాంగ్రెస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగి పలువురు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి.

**ఎర్రవల్లి, సెప్టెంబర్ 8 (చురకలు):** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. శాసనమండలిలో స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఇచ్చిన పిలుపుతో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు డప్పులతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి తరలివచ్చారు. వారిని పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకోవడంతో పలుచోట్ల తోపులాటలు చోటుచేసుకున్నాయి. సుమారు రెండున్నర గంటలపాటు ఫామ్‌హౌస్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. కాంగ్రెస్ నేతలు వెయ్యి మిగతా 2 లో

# తాతా మధు, నవీన్‌పై సస్పెన్షన్ వేటు




- సెషన్ మొత్తానికి మండలి నుంచి సస్పెన్షన్
- ఇద్దరిపై చర్యలకు తీర్మానం ఆమోదం
- మూజువాణి ఓటుతో నిర్ణయం
- కోర్టు నుంచి విడుదలై సభకు రానానే చర్చ
- సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ఆందోళన

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (చురకలు):** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం చైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించడంతో ఇద్దరు ఎమ్మెల్సీలను ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

మిగతా 2 లో

# నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు..



- హరీశ్‌రావుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ ఘాటు బదులు
- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల చర్యలేవని హరీశ్ నిలదీత
- సబిత, సునీత ఘటనలపై సభలో వాడీవేడి చర్చ
- దాడి జరిగితే విచారించి చర్యలు తీసుకుంటామన్న సీతక్క
- పోలీసుల తీరును పరిశీలిస్తామన్న మంత్రి శ్రీధర్‌బాబు

3

మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడి ఆరోపణల అంశం తెలంగాణ అసెంబ్లీని కుదిపేసింది. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు సభలో నిలదీశారు. "మా అక్కాచెల్లెమ్మలకు జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్రంగా స్పందిస్తూ.. "అవమానం జరిగింది నీ తల్లికి కాదు.. మా అమ్మకు. ఆవేశం నీకంటే నాకు ఉండాలి" అంటూ ఘాటుగా బదులిచ్చారు.





## బతుకమ్మపై యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్

- యువ ప్రతిభకు సరికొత్త వేదిక
- అధికారిక పోస్టర్ ఆవిష్కరించిన కోమటిరెడ్డి
- షార్ట్ ఫిలింలు.. పాటలు.. సృజనాత్మక వీడియోలకు అవకాశం
- తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటాలని పిలుపు
- యువ దర్శకులు, విద్యార్థులు పాల్గొనాలని సూచన

2

## అంతిమ విజయం సత్యానిదే!

- యువత సత్యమార్గంలోనే నడుస్తోంది
- ప్రజా భాగస్వామ్యంతోనే శాశ్వత మార్పు
- ప్రజాసేవే అధికారానికి పరమార్థం
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం
- విమర్శకులకు వడోదర వేదికగా చురకలు
- భారీ అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం

4



## ప్రధాని భద్రతలో కలకలం

- మోదీ కార్యక్రమంలో నకిలీ గుర్తింపు కార్డుతో యువకుడు
- వెంట వచ్చిన వ్యక్తి వద్ద తుపాకీ
- ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు

4

చురకలు





# బతుకమ్మపై 'యంగ్ ఫిలిం మేకర్స్' ఛాలెంజ్

**అధికారిక పోస్టర్ ఆవిష్కరించిన కోమటిరెడ్డి**

**షార్ట్ ఫిలింలు.. పాటలు.. సృజనాత్మక వీడియోలకు అవకాశం**

**తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటాలని పిలుపు**

**యువ దర్శకులు, విద్యార్థులు పాల్గొనాలని సూచన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (చురకలు):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటడంతో పాటు యువతలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న లిలి'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026'లిలిను య-ంవత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సచివాలయంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి.ముకుందరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్‌రెడ్డితో కలిసి ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను నిరూపించుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ మంచి వేదికగా నిలుస్తుందన్నారు. యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. బతుకమ్మ విశిష్టతతో పాటు తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించేలా సృజనాత్మక చిత్రాలను రూపొందించాలని మంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే అంశాలతోనూ షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. యువత తమ సృజనాత్మక ఆలోచనలకు పదునుపెట్టి బతుకమ్మ గొప్పతనాన్ని వినూత్నంగా ఆవిష్కరించాలని, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశంగా 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026'ను ఉపయోగించుకోవాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# స్కూల్ బస్సులో అకస్మాత్తుగా మంటలు

**విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (చురకలు):** తెల్లాపూర్‌లోని మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన బస్సులో మంగళవారం ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ప్రాథమిక తరగతుల విద్యార్థులు బస్సు ఎక్కుతున్న సమయంలో ఇంజన్ భాగం నుంచి మంటలు వ్యాపించడంతో తీవ్ర కలకలం రేగింది. అప్రమత్తమైన స్కూల్ సిబ్బంది, డ్రైవర్ తక్షణమే స్పందించి పిల్లలను బస్సు నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించడంతో ప్రాణనష్టం తప్పి పెను ప్రమాదం నివారించబడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురయ్యారు. పాఠశాల యాజమాన్యం బస్సుల నిర్వహణ, ఫిట్‌నెస్ నిబంధనలు, భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసిందని ఆరోపించారు. గతంలోనూ ఇదే స్కూలుకు చెందిన మరొక బస్సు ప్రమాదానికి గురైందని గుర్తుచేస్తూ, పాఠశాలలోని అన్ని వాహనాల కండిషన్‌పై రవాణా శాఖ అధికారులు సమగ్ర తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అత్యవసర ద్వారాలు, అగ్నిమాపక పరికరాల లభ్యతపై విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# నగరంలో మరో భారీ ఫ్లైఓవర్

**బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలికి ఎలివేటెడ్ కారిడార్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (చురకలు):** హైదరాబాద్ మహానగరంలో అత్యంత కీలకమైన ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హెచ్‌ఎండీఏ ఒక భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ వరకు దాదాపు 9 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ ప్రాజెక్టు కోసం అధికారులు తాజాగా టెండర్లను ఆహ్వానించారు. అంచనా వ్యయం రూ.1,656 కోట్లుగా నిర్ణయించిన ఈ కారిడార్ నిర్మాణానికి అర్హులైన కాంట్రాక్టర్లు ఈ నెల 22వ తేదీ లోపు బిడ్లు దాఖలు చేయాలని సూచించారు. మొత్తం రెండు దశల్లో రూపుదిద్దుకోనున్న ఈ ప్రాజెక్టులో తొలి దశ కింద ఫిలింనగర్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు 5 కి.మీ, రెండో దశలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హకీంపేట్ కుంట వరకు 4 కి.మీ మేర పనులు చేపట్టనున్నారు. ప్రయాణికుల రాకపోకల సౌకర్యార్థం ఫిలింనగర్, నార్నే రోడ్, జూబ్లీహిల్స్, ఐటీసీ కోహినూర్, టీ-హబ్, మైండ్‌స్పేస్ వద్ద 6 ర్యాంప్‌లను అందుబాటులోకి తేవడంతో పాటు భవిష్యత్తు మెట్రో విస్తరణకు అనుగుణంగా డిజైన్ చేశారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు తొలిగి, నగర నడిబొడ్డు నుంచి ఓఆర్ఆర్ చేరుకోవడం సులభతరం కానుంది.

# ఎర్రవల్లిలో హైటెన్షన్..



మొదటి పేజీ తరువాయి

మంది డప్పు కళాకారులతో ఫామ్‌హౌస్ వద్ద నిరసన చేపట్టేందుకు పిలుపునివ్వడంతో పోలీసులు ముందుగానే అప్రమత్తమయ్యారు. ఎర్రవల్లి వెళ్లే ప్రధాన మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ స్వయంగా ఫామ్‌హౌస్ వద్దకు చేరుకుని భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**అరకిలోమీటరు దూరంలో డప్పుల మోత**

వరదరాజాపూర్ మీదుగా ఫామ్‌హౌస్ సమీపానికి చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సుమారు అరకిలోమీటరు దూరంలోనే డప్పులు మోగిస్తూ నిరసన తెలిపారు. కొందరు నిరసనకారులు బారికేడ్లను తోసుకుని ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని వెనక్కి పంపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పలువురు పోలీసులకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నర్సారెడ్డి అస్వస్థతకు గురికావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

**పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనం**

వరదరాజాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీ నిరసనలకు దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఇరుపార్టీల కార్యకర్తలు రేవంత్‌రెడ్డి, కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. దామరకుంటలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం. దీంతో పామోజు సహా పరిసర ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

**ఎర్రవల్లి బయలుదేరిన కేటీఆర్, హరీశ్**

కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు తరలివస్తున్న విషయం తెలియడంతో అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు ఎర్రవల్లికి బయలుదేరారు. వారిని తొలుత బొల్లారం వద్ద, అనంతరం హకీంపేట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వాహనాలను ముందుకు అనుమతించకపోవడంతో కేటీఆర్, హరీశ్‌రావు కార్లు దిగి పాదయాత్రగా ఎర్రవల్లికి వెళ్లేందుకు ప్రయత్నించారు. కొంతదూరం వెళ్లిన అనంతరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కేటీఆర్‌ను బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు, హరీశ్‌రావును జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులను కూడా అదుపులోకి తీసుకున్నారు.

**'కాంగ్రెస్‌కు సహకరిస్తున్నారు'**

కేసీఆర్ ఫామ్‌హౌస్ వైపు కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్లేందుకు పోలీసులు సహకరిస్తూ.. తమను మాత్రం అడ్డుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. తమ పార్టీ అధినేతకు రక్షణగా వెళ్లేందుకు ప్రయత్నిస్తే అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అయితే ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులనూ అడ్డుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.



**తాతా మధు వ్యాఖ్యలతోనే రగడ**

శాసనమండలిలో స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు భావిస్తున్న వ్యాఖ్యలపై వివాదం చెలరేగిన నేపథ్యంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఈ నిరసనకు పిలుపునిచ్చింది. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల సభ్యులు డిమాండ్ చేశారు. మరోవైపు తన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావని, అపార్థమైతే వాటిని వెనక్కి తీసుకుంటానని తాతా మధు ఇప్పటికే వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ శ్రేణుల ముట్టడి ప్రయత్నం.. బీఆర్ఎస్ నేతల ఎర్రవల్లి ప్రయాణం.. ఇరుపార్టీల పోటాపోటీ నిరసనలు.. కేటీఆర్, హరీశ్‌రావు అరెస్టులతో ఎర్రవల్లి, గజ్వేల్ పరిసరాల్లో గంటలపాటు రాజకీయ ఉద్రిక్తత కొనసాగింది. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు భారీ బందోబస్తును కొనసాగించారు.

# నీ తల్లికి కాదు.. మా అమ్మకు అవమానం జరిగింది

**హరీశ్‌రావుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ ఘాటు బదులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (చురకలు):** మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడి ఆరోపణల అంశం తెలంగాణ అసెంబ్లీని కుదిపేసింది. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు సభలో నిలదీశారు. "మా అక్కాచెల్లెమ్మలకు జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్రంగా స్పందిస్తూ.. "అవమానం జరిగింది నీ తల్లికి కాదు.. మా అమ్మకు. ఆవేశం నీకంటే నాకు ఉండాలి" అంటూ ఘాటుగా బదులిచ్చారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన పరిణామాలను హరీశ్‌రావు సభలో ప్రస్తావించారు. సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కారని, మగ పోలీసులు ఆమెతో దురుసుగా వ్యవహరించినట్లు వీడియోల్లో కనిపిస్తోందని ఆరోపించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి అవమానించారని, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి మహిళా ఎమ్మెల్యేలపైనే కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. "బాధితులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం వారిపైనే కేసులు పెట్టి వేధించడం ఏంటి? ఇది మంచి పద్ధతి కాదు. మహిళా ప్రజాప్రతినిధులతో ఇలా వ్యవహరిస్తే ఎలా?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. జరిగిన పరిణామాలు చూస్తుంటే ఇది గౌరవ సభ కాకుండా 'కౌరవ సభ'గా మారిందని తీవ్రంగా వ్యాఖ్యానించారు. అదే సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తనకు ఎంతో గౌరవం ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆయనతో కలిసి సభలో పనిచేశామని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ తాతా మధు సైతం తన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావని వివరణ ఇచ్చారని, ఒకవేళ స్పీకర్ తనను ఉద్దేశించే అన్నారని భావిస్తే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటానంటూ విచారం వ్యక్తం చేశారని చెప్పారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. మహిళా ప్రజాప్రతినిధులను ప్రభుత్వం గౌరవిస్తుందని, సభాధ్యక్షుడిగా తనకూ వారిపట్ల పూర్తి గౌరవం ఉందన్నారు. "హరీశ్‌రావు.. మీరు చెప్పింది మేం విన్నాం. మేం చెప్పేది కూడా వినండి. ఆవేశం నీకు కాదు.. నాకు ఉండాలి. వాళ్లు అన్నది నీ తల్లిని కాదు.. నా తల్లిని అవమానించారు. దానికి ఏం సమాధానం చెబుతావు?" అని స్పీకర్ ప్రశ్నించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి తనకు సోదరీమణుల వంటి వారని, వారిపట్ల తనకు ఎంతో గౌరవం ఉందని స్పష్టం చేశారు. అదే సమయంలో తన తల్లిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారన్న అంశాన్ని విస్మరించలేమని పేర్కొన్నారు. మంత్రి సీతక్క కూడా అసెంబ్లీ గేటు వద్ద జరిగిన పరిణామాలపై స్పందించారు. మహిళా పోలీసుల ఎదుట దుస్తులు విప్పాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. స్పీకర్‌ను, ఆయన తల్లిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సమర్థనీయమా అని నిలదీశారు. సభా నిబంధనలను రూపొందించిన వారే వాటిని ఉల్లంఘిస్తూ అభ్యంతరకర భాష ఉపయోగించడం సరికాదన్నారు. అయితే తమ చీరలు లాగారని, తమపై దాడి చేశారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలపైనా సీతక్క స్పందించారు. నిజంగా అలాంటి దాడి జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులైన పోలీసులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలీసుల వ్యవహారశైలిపై వచ్చిన ఆరోపణలను పరిశీలిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు కూడా పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలపై ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ప్రకటించిన డిక్లరేషన్‌లోని హామీలను అమలు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసేందుకు అవకాశం లేకుండా ఎందుకు ఉంచుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దురుసు ప్రవర్తన ఆరోపణలు ఒకవైపు.. స్పీకర్, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యల వివాదం మరోవైపు సభలో తీవ్ర వాగ్వాదానికి దారితీశాయి. ఇరువైపుల ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలన్న డిమాండ్ ఈ సందర్భంగా మరింత బలంగా వినిపించింది.

# తాతా మధు, నవీన్‌పై సస్పెన్షన్ వేటు

మొదటి పేజీ తరువాయి

ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవి గౌరవాన్ని తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని సభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించారని, మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలపైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించి స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి చైర్మన్‌కు పంపించారు. మరోవైపు అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కోర్టులో హాజరుపరిచారు. అయితే పోలీసుల రిమాండ్ అభ్యర్థనను నాంపల్లి కోర్టు తిరస్కరించింది. ఒక్కొక్కరు రూ.10 వేల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించడంతో ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు.

**కోర్టు నుంచి మండలికి.. అక్కడే సస్పెన్షన్**

కోర్టు నుంచి విడుదలైన అనంతరం తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి నేరుగా శాసనమండలి సమావేశాలకు




హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇద్దరిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే మంత్రి శ్రీధర్‌బాబు సస్పెన్షన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా మండలి ఆమోదించింది.

**మండలి ఆవరణలో బీఆర్ఎస్ బైఠాయింపు**

తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరినీ సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో బైఠాయించి నిరసన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులో భాగంగానే తమ ఎమ్మెల్సీలపై చర్యలకు దిగిందని బీఆర్ఎస్ ఆరోపించగా.. స్పీకర్ పదవి, సభా మర్యాదలను కాపాడేందుకే చర్యలు తీసుకున్నట్లు అధికారపక్షం పేర్కొంది. దీంతో అసెంబ్లీ ఆవరణలో మొదలైన వ్యాఖ్యల వివాదం.. అరెస్టులు, కోర్టు పరిణామాల తర్వాత చివరకు ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్ వరకు చేరింది.

చురకలు



# కేసీఆర్ హత్యకు కుట్ర.. భద్రత కల్పించాలి

## కేసీఆర్ రక్షణ ప్రభుత్వ బాధ్యతే: కేటీఆర్

### పోలీసులపై నమ్మకం లేదంటూ సంచలన వ్యాఖ్యలు

### ఎర్రవల్లి వెళ్తున్న కేటీఆర్, హరీశ్ అరెస్ట్

### కాంగ్రెస్ శ్రేణులను ఎందుకు అడ్డుకోలేదని నిలదీత

### బోయిన్‌పల్లి పీఎస్ వద్ద బీఆర్ఎస్-కాంగ్రెస్ ఘర్షణ



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (చురకలు):** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భద్రతపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్‌పై కుట్రపూరితంగా హత్యాయత్నానికి పాల్పడ్డాయని ఆరోపించారు. కేసీఆర్‌కు పూర్తి రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేశారు. ఆయన భద్రత విషయంలో పోలీసులపై తమకు నమ్మకం లేదని, తమ నాయకుడిని తామే కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. అయితే కేసీఆర్‌పై హత్యాయత్నం జరిగిందన్న కేటీఆర్ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ వెలువడలేదు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు ముట్టడించేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారంతో కేసీఆర్‌ను పరామర్శించేందుకు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అక్కడికి బయలుదేరారు. తొలుత బొల్లారం వద్ద, అనంతరం హకీంపేట వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

### 'కాంగ్రెస్‌ను వదిలి మమ్మల్ని అడ్డుకుంటారా?'

కాంగ్రెస్ కార్యకర్తలు కేసీఆర్ ఫామ్‌హౌస్ వరకు ఎలా వెళ్లగలిగారని కేటీఆర్ పోలీసులను ప్రశ్నించారు. తమ సొంత పార్టీ అధినేత నివాసానికి వెళ్తున్న తమను మాత్రం ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. దీనిపై డీజీపీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ నివాసం వైపు ఎవరినీ అనుమతించడం లేదని పోలీసులు వివరించినప్పటికీ బీఆర్ఎస్ నేతలు వెనక్కి తగ్గలేదు. బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా వెళ్లేందుకు ప్రయత్నించడంతో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ తదితర పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

### 'కేసీఆర్‌ను మనమే కాపాడుకోవాలి'

బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద వందలాది మంది పోలీసులను మోహరించినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఆయన భద్రతపై తమకు ఆందోళన ఉందన్నారు. "కేసీఆర్‌ను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. కానీ పోలీసులపై మాకు నమ్మకం లేదు. మన నాయకుడిని మనమే కాపాడుకోవాలి" అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ నివాసం వద్దకు కాంగ్రెస్ శ్రేణులు వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ కార్యకర్తలను వదిలేసి ప్రతిపక్ష నేతలనే లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.

### 'డైవర్షన్ రాజకీయాలు'

ఎన్నికల హామీల అమలులో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలకు తెరలేపుతోందని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిందిపోయి కేసీఆర్, బీఆర్ఎస్‌ను విమర్శించడానికే సమయం వెచ్చిస్తున్నారని ఆరోపించారు. దళితులు, గిరిజనులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు సహా పలు అంశాల్లో ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకునే వరకు ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### 'కేంద్రం జోక్యం చేసుకోవాలి'

మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలను చర్చించకుండా రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నివాసంపై దాడికి ముఖ్యమంత్రే ఉసిగొల్పారని హరీశ్‌రావు ఆరోపిస్తూ.. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఎమ్మెల్యే శంకర్‌పై కేసు నమోదు చేసి, సభ్యత్వం రద్దు చేయాలని కోరారు. ఇవన్నీ బీఆర్ఎస్ నేతలు చేసిన రాజకీయ ఆరోపణలేనని, వాటిపై ప్రభుత్వం లేదా సంబంధిత వర్గాల స్పందన రావాల్సి ఉంది.

### బోయిన్‌పల్లి పీఎస్ వద్ద రణరంగం

మరోవైపు కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలను బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తమ నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. పరిస్థితి ఒక్కసారిగా అదుపుతప్పి కొందరు రాళ్లు, కుర్చీలు విసురుకున్నట్లు సమాచారం. దీంతో పోలీస్‌స్టేషన్ పరిసరాలు రణరంగాన్ని తలపించాయి. పోలీసులు ఇరువర్గాలను నిలువరించేందుకు తీవ్రంగా శ్రమించారు.

### పలువురికి గాయాలు

ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన పలువురు కార్యకర్తలు గాయపడినట్లు సమాచారం. కాంగ్రెస్‌కు చెందిన ఓ మహిళా కార్యకర్త చేతికి తీవ్ర గాయమైనట్లు తెలుస్తోంది. అయితే గాయపడిన వారి సంఖ్య, గాయాల తీవ్రతపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దించి ఇరువర్గాలను చెదరగొట్టారు. బోయిన్‌పల్లి, జవహర్‌నగర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలను తరలించిన పోలీస్‌స్టేషన్ల వద్ద భద్రతను పెంచారు. కేసీఆర్ భద్రతపై కేటీఆర్ చేసిన తీవ్ర ఆరోపణలు, ఎర్రవల్లి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ అగ్రనేతల అరెస్టులు, ఆ వెంటనే బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్--కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణలతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా మరింత వేడెక్కాయి.

# సాగు విస్తీర్ణం భారీగా పెంచాలి

### రైతులకు లాభసాటి పంటలపై దృష్టి

### నాబార్డు సహకారం తీసుకోవాలని ఆదేశం

### డ్రిప్ సాగుకు మరింత ప్రోత్సాహం

### అధికారులకు సీఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (చురకలు):** రాష్ట్రంలో కూరగాయలు, పండ్ల తోటలు, చిరుధాన్యాలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రైతుల ఆదాయం పెరిగేలా లాభసాటి పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సంజయ్ జాజు అధ్యక్షతన కూరగాయల సాగు, పండ్ల తోటలు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై సోమవారం సమీక్ష సమావేశం జరిగింది. వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎం.జ్ఞానప్రకాశ్, ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి పాల్గొన్నారు. రైతులకు అధిక ఆదాయం సమకూర్చే కూరగాయల సాగును మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని సీఎస్ పేర్కొన్నారు. ఏ ప్రాంతంలో ఏ పంట సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయో గుర్తించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కూరగాయలు, పండ్ల తోటలు, చిరుధాన్యాలు, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం పెరిగేలా వ్యవసాయ, ఉద్యానశాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహకారం అందించేందుకు నాబార్డుతో పాటు సంబంధిత సంస్థల సహకారాన్ని తీసుకోవాలని సంజయ్ జాజు సూచించారు. పంట ఉత్పత్తితోనే సరిపెట్టకుండా వాటికి మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, విలువ ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయడంపైనా ప్రత్యేకంగా దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సీఎస్ సూచించారు. ముఖ్యంగా ఉద్యాన, ప్రత్యామ్నాయ పంటల్లో డ్రిప్ ఇరిగేషన్‌తో పాటు నీటిని పొదుపుగా వినియోగించే సాగు విధానాలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానశాఖలతో పాటు వ్యవసాయ, పశువైద్య విశ్వవిద్యాలయాలు పరస్పర సమన్వయంతో పనిచేసి రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని సంజయ్ జాజు సూచించారు. వాతావరణ మార్పులను తట్టుకునే స్థిరమైన వ్యవసాయ విధానాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# 'నాకేం తెలియదు.. అంతా నా భర్తే చూసుకున్నాడు'

### పోలీసుల ఎదుట యూట్యూబర్ నందన వాదన

### వీసా మోసం కేసులో నాలుగు గంటల విచారణ

### కీలక ప్రశ్నలకు 'తెలియదు' అంటూ సమాధానం

### ఈ నెల 16న మళ్లీ రావాలని నోటీసులు

### భర్త మధుకర్ పాత్రపై పోలీసుల దృష్టి



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 8 (చురకలు):** వీసాల పేరిట డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో యూట్యూబర్ నందన మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని, వీసా కన్సల్టెన్సీతో పాటు వ్యాపార లావాదేవీలన్నీ తన భర్త మధుకరే చూసుకున్నాడని ఆమె పోలీసులకు వివరించినట్లు సమాచారం. దాదాపు నాలుగు గంటలపాటు సాగిన విచారణలో పలు ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రాకపోవడంతో ఈ నెల 16న మరోసారి విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. లుకౌట్ నోటీసుల నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయంలో నందనను అధికారులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఇబ్రహీంపట్నం సీఐ తెలిపారు. అనంతరం పోలీసులు ఆమెకు విచారణ నోటీసులు జారీ చేయగా మంగళవారం హాజరైనట్లు వెల్లడించారు. విచారణలో తాను ఐటీ ఉద్యోగినిగా పనిచేస్తూ యూట్యూబర్‌గా కొనసాగుతున్నానని నందన చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు. వీసా కన్సల్టెన్సీ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, వీసాల ప్రక్రియ, డబ్బుల వసూళ్లతో తనకు సంబంధం లేదని ఆమె వివరించినట్లు తెలిపారు. సదరు కంపెనీలో తాను డైరెక్టర్‌గా గానీ, ఉద్యోగిగా గానీ లేనని, వ్యాపార వ్యవహారాలన్నీ తన భర్త మధుకరే చూసుకునేవాడని చెప్పినట్లు సమాచారం. అయితే పలు కీలక ప్రశ్నలకు నందన నుంచి 'నాకు తెలియదు' అనే సమాధానమే రావడంతో మరోసారి విచారించాలని పోలీసులు నిర్ణయించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులో నందనతో పాటు ఆమె భర్త మధుకర్, మామగారి పేర్లు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో నందన ఇచ్చిన వాంగ్మూలాన్ని ఇతర ఆధారాలతో సరిపోల్చడంతో పాటు ప్రస్తుతం విదేశాల్లో ఉన్నట్లు చెబుతున్న మధుకర్ పాత్రపైనా దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన విచారణ పూర్తయిన తర్వాత భర్తను విచారణకు పంపిస్తానని నందన చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆయన పిల్లలను చూసుకుంటున్నారని, తాను వెళ్లిన తర్వాత మధుకర్ భారత్‌కు వస్తారని ఆమె వివరించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 16న నందనను మరోసారి విచారించనున్న పోలీసులు.. ఆమె వాంగ్మూలం, బాధితుల ఫిర్యాదులు, ఆర్థిక లావాదేవీలు తదితర ఆధారాలను పరిశీలిస్తూ కేసులో ఎవరి పాత్ర ఎంత ఉందన్న అంశాన్ని తేల్చే దిశగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

### నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం

### టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (చురకలు):** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

# పట్టుదల.. క్రమశిక్షణే విజయానికి సోపానాలు

### మైనారిటీ యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

### స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ కేంద్రం ప్రారంభం

### బాలికలు చదువు, ఉద్యోగాల్లో మరింత ముందుకు రావాలి

### మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పిలుపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (చురకలు):** జీవితంలో విజయం సాధించాలంటే లక్ష్యంపై మక్కువ, కఠోర శ్రమ, క్రమశిక్షణ, దృఢ సంకల్పం ఎంతో అవసరమని మైనారిటీ సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులు, యువతకు కల్పిస్తున్న విద్యా, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఇందిరా ప్రియదర్శిని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మైనారిటీ స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని మంత్రి అజారుద్దీన్ ప్రారంభించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే మైనారిటీ యువతకు శిక్షణతో పాటు సరైన కెరీర్ మార్గదర్శనం అందించడంలో ఈ కేంద్రం కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. మైనారిటీ సంక్షేమశాఖ అధికారులు తక్కువ సమయంలో కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడాన్ని మంత్రి అభినందించారు. ముఖ్యంగా శాఖ డైరెక్టర్ తారిఖ్ అన్వర్ కృషిని ప్రశంసించారు. ప్రభుత్వం అవసరమైన సదుపాయాలు, అవకాశాలు కల్పిస్తుందని.. వాటిని సమర్థంగా ఉపయోగించుకుని జీవితంలో ముందుకు వెళ్లాల్సిన బాధ్యత విద్యార్థులదేనన్నారు. "జీవితంలో ఏదీ ఉచితంగా రాదు. ప్రభుత్వం మీకు అవసరమైన అవకాశాలను కల్పించింది. వాటిని అందిపుచ్చుకుని ముందుకు సాగాలి. అందుకు మీరు చెల్లించాల్సిన ధర కఠోర శ్రమ" అని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు సందేహాలను అడగడానికి ఎప్పుడూ వెనుకాడకూడదని అజారుద్దీన్ సూచించారు. ప్రశ్నించడం కూడా నేర్చుకునే ప్రక్రియలో కీలక భాగమన్నారు. తన క్రికెట్ జీవితాన్ని గుర్తుచేసుకుంటూ భారత జట్టుకు ఆడుతున్న సమయంలో అప్పటి కెప్టెన్ సునీల్ గవాస్కర్‌ను తరచూ ప్రశ్నలు అడిగి, సలహాలు తీసుకునేవాడినని చెప్పారు. ఆ మార్గదర్శనం తన ఆటను మెరుగుపరుచుకునేందుకు ఎంతో ఉపయోగపడిందన్నారు. బాలికలు విద్య, ఉద్యోగ రంగాల్లో తమ భాగస్వామ్యాన్ని మరింత పెంచుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యంపై దృష్టి పెట్టాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిజాం కళాశాలలో చదువుకున్న రోజులనూ అజారుద్దీన్ గుర్తుచేసుకున్నారు. కనీస సౌకర్యాలు లేకపోయినా చెట్టు కింద కూర్చుని చదువుకున్న తన ఇద్దరు స్నేహితులు తర్వాత జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్నారని చెప్పారు. పరిస్థితుల కంటే పట్టుదల, కృషి ముఖ్యమని వారి జీవితం నిరూపించిందన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మైనారిటీల విద్యాభివృద్ధి, సమగ్ర అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని అజారుద్దీన్ తెలిపారు. యువతకు మెరుగైన అవకాశాలు కల్పించాలన్న స్పష్టమైన దృక్పథంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ విద్య ప్రాధాన్యాన్ని వివరించారు. ఖురాన్‌లో మొదటగా అవతరించిన పదం 'ఇఖ్రా' అని, దాని అర్థం 'చదువు' అని పేర్కొన్నారు. మైనారిటీ యువత సాధికారతకు విద్య, జ్ఞానమే ప్రధాన ఆయుధాలని చెప్పారు. మైనారిటీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ అధ్యక్షుడు ఫహీం ఖురేషీ మాట్లాడుతూ కొత్త కేంద్రం మైనారిటీ యువతకు కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. సివిల్ సర్వీసులు, ఇతర పోటీ పరీక్షల్లో మైనారిటీ విద్యార్థుల ప్రాతినిధ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమశాఖ డైరెక్టర్ తారిఖ్ అన్వర్, అహ్మద్ నదీమ్, ఉబైదుల్లా కొత్వాల్, అజ్మతుల్లా హుస్సేనీతో పాటు అధికారులు, ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. అవకాశాలు తలుపుతట్టినప్పుడు వాటిని అందిపుచ్చుకుని పట్టుదలతో కష్టపడాలని, విద్యనే ఆయుధంగా చేసుకుని విజయవంతమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని అజారుద్దీన్ యువతకు పిలుపునిచ్చారు.



## సంపాదకీయం



# అసెంబ్లీ గేటు వద్దే ప్రజాస్వామ్యానికి అడ్డుకట్టా?

**ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సరైన సంప్రదాయం కాదు**

**మహిళా ఎమ్మెల్యేల విషయంలో మరింత సంయమనం అవసరం**

**సభా నియమాలపై నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకరే**

**అధికారానికి సంయమనం.. ప్రతిపక్షానికి బాధ్యత అవసరం**

**గేట్ల వద్ద ఘర్షణలు కాదు.. సభలో ప్రజా సమస్యలపై చర్చ జరగాలి**

తెలంగాణ శాసనసభ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏమాత్రం శోభనివ్వవు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నల్ల దుస్తులతో సభకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడం, ఆ తర్వాత తోపులాటలు, అరెస్టులు చోటుచేసుకోవడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ముఖ్యంగా సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి వంటి మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారంటూ బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు మరింత వివాదానికి కారణమయ్యాయి. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో అసలు ఏం జరిగిందన్న దానిపై నిష్పక్షపాత విచారణ అవసరం ఏర్పడింది. ప్రజలు ఎన్నుకున్న శాసనసభ్యులు సభకు వెళ్లడం వారి హక్కు మాత్రమే కాదు.. తమను ఎన్నుకున్న ప్రజల తరఫున గొంతు వినిపించాల్సిన బాధ్యత కూడా. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం, అవసరమైనప్పుడు నిరసన తెలియజేయడం ప్రతిపక్షానికి ప్రజాస్వామ్యం కల్పించిన అవకాశం. అయితే సభ్యులు సభలో ఎలాంటి దుస్తులు ధరించాలి? వాటిపై ఎలాంటి నినాదాలు ఉండవచ్చు? ఏది సభా మర్యాదలకు విరుద్ధం? ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించారా? అన్న అంశాలపై అంతిమంగా నిర్ణయం తీసుకోవాల్సింది సభాపతి. శాసనసభ గేటు వద్దే పోలీసులు ఆ పాత్రను తమ చేతుల్లోకి తీసుకునే పరిస్థితి ఏర్పడితే అది భవిష్యత్తులో ప్రమాదకరమైన సంప్రదాయానికి దారితీసే అవకాశం ఉంటుంది. ఈ వివాదంపై తెలంగాణ హైకోర్టు చేసినట్లు వెలువడిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోరాదని, సభా నియమాలను సభ్యులు ఉల్లంఘిస్తే ఆ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకర్ అని న్యాయస్థానం పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. మహిళా ప్రజాప్రతినిధులతో పోలీసులు వ్యవహరించినట్లు వచ్చిన ఆరోపణలనూ కోర్టు తీవ్రంగా పరిగణించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు మొత్తం ఘటనపై సమగ్రంగా సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఎవరి పరిధి ఎక్కడి వరకు? సభలోకి ప్రవేశించే ప్రజాప్రతినిధుల విషయంలో పోలీసులు ఎలా వ్యవహరించాలి? అన్న అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలి. మహిళా ఎమ్మెల్యేల విషయంలో వచ్చిన ఆరోపణలు మరింత సున్నితమైనవి. రాజకీయ పార్టీ ఏదైనా కావచ్చు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. మహిళా ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించే పరిస్థితులకు ఆస్కారం ఉండకూడదు. తోపులాట సమయంలో సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని, సబితా ఇంద్రారెడ్డితో దురుసుగా వ్యవహరించారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. మరోవైపు పోలీసులు ఈ ఆరోపణలను ఖండిస్తున్నారు. అందుకే అందుబాటులో ఉన్న పూర్తి వీడియో దృశ్యాలు, ఇతర ఆధారాలను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల బాధ్యతే. కానీ ఆ బాధ్యతను నిర్వర్తించే క్రమంలో సంయమనం, కనీస బలప్రయోగం, చట్టబద్ధమైన పద్ధతులు అత్యంత కీలకం. అందులోనూ ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులతో వ్యవహరించేటప్పుడు మరింత జాగ్రత్త అవసరం. అధికార వ్యవస్థ సంయమనం పాటించాలన్నంత మాత్రాన ప్రతిపక్షానికి బాధ్యత లేదని కాదు. నిరసన ప్రజాస్వామ్యంలో సహజమైన హక్కు. కానీ అది సభా గౌరవాన్ని దెబ్బతీసేలా ఉండకూడదు. వ్యక్తిగత దూషణలు, అభ్యంతరకర నినాదాలు, ఉద్రిక్తతను పెంచే చర్యలకు దూరంగా ఉండాలి. స్పీకర్ పదవి గౌరవాన్ని, శాసనసభ ప్రతిష్ఠను కాపాడాల్సిన బాధ్యత అధికార, ప్రతిపక్షాలకు సమానంగానే ఉంటుంది. ప్రజాస్వామ్యంలో ఎంత తీవ్రంగా విభేదించినా చివరకు చర్చకు వేదిక శాసనసభే కావాలి. నినాదాలకు సమాధానం లాఠీలు కాకూడదు. అలాగే రాజకీయ విమర్శలు వ్యక్తిగత దూషణల స్థాయికి దిగజారకూడదు. అసెంబ్లీ అంటే ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదిక. అక్కడ రైతుల సమస్యలు వినిపించాలి. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగం, పింఛన్లు, భూములు, సాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై చర్చ జరగాలి. ప్రతిపక్షం ప్రశ్నించాలి.. ప్రభుత్వం సమాధానం చెప్పాలి. కానీ సభ గేటు వద్ద తోపులాటలు, అరెస్టులు, పోలీసుల బలప్రయోగం, ప్రజాప్రతినిధులపై దురుసు ప్రవర్తన ఆరోపణలే ప్రధాన చర్చగా మారితే అసలు ప్రజా సమస్యలు వెనక్కి వెళ్లిపోతాయి. అంతిమంగా నష్టపోయేది ప్రజలే. అందుకే అసెంబ్లీ గేటు వద్ద జరిగిన మొత్తం ఘటనపై నిష్పక్షపాత విచారణ జరగాలి. వీడియో దృశ్యాలను పరిశీలించి పోలీసుల నుంచి అతిక్రమణ జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో శాసనసభ సమావేశాల సందర్భంగా ప్రజాప్రతినిధుల ప్రవేశం, నిరసనలు, పోలీసుల పాత్రపై స్పష్టమైన విధివిధానాలను రూపొందించాలి. మరోసారి ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా అధికార యంత్రాంగం, శాసనసభ వ్యవస్థ మధ్య సమన్వయం ఉండాలి. ప్రజాస్వామ్యంలో నిరసనను అణచివేయడం పరిష్కారం కాదు.. నిరసన పేరుతో సభా మర్యాదలను దాటడమూ సమర్థనీయం కాదు. అధికారానికి సంయమనం.. ప్రతిపక్షానికి బాధ్యత.. పోలీసులకు చట్టబద్ధమైన పరిధిపై స్పష్టత అవసరం. ఈ మూడూ సమతూకంగా ఉన్నప్పుడే శాసనసభ గేటు ఘర్షణలకు వేదిక కాకుండా.. సభ ప్రజల గొంతు వినిపించే నిజమైన ప్రజాస్వామ్య మందిరంగా నిలుస్తుంది.


# అంతిమ విజయం సత్యానిదే!

- యువత సత్యమార్గంలోనే నడుస్తోంది
- ప్రజా భాగస్వామ్యంతోనే శాశ్వత మార్పు
- ప్రజాసేవే అధికారానికి పరమార్థం
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం
- విమర్శకులకు వడోదర వేదికగా చురకలు
- భారీ అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం



**వడోదర, సెప్టెంబర్ 8 (చురకలు):** అసత్యాలను పదేపదే ప్రచారం చేసి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఎన్ని ప్రయత్నాలు జరిగినా అంతిమ విజయం సత్యానిదేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'అబద్ధాల హోరు' కంటే దేశ యువత స్వరం, వారి ఆకాంక్షలే బలమైనవని పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా వడోదరలో నిర్వహించిన బహిరంగ సభలో యువతను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉంటాయని, అయితే భారత యువత సత్యమార్గంలో ముందుకు సాగుతోందని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపడుతున్న విద్యార్థి కార్యక్రమాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ 'అబద్ధాల హోరు' కంటే యువత స్వరమే చివరకు గెలుస్తుందని వ్యాఖ్యానించారు. వడోదర–ముంబై మధ్య ఇటీవల ప్రారంభమైన డబుల్ డెకర్ గూడ్స్ రైలును ప్రస్తావించిన ప్రధాని.. ఒక్క ట్రిప్‌లో సుమారు 250 ట్రక్కులకు సమానమైన సరకు రవాణా చేయగల సామర్థ్యం దీనికి ఉందన్నారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాల్లోనూ కొందరు విమర్శించడానికి కారణాలు వెతుకుతున్నారని ప్రతిపక్షాలపై చురకలు అంటించారు. "డబుల్ డెకర్ గూడ్స్ రైలు ప్రారంభిస్తే ట్రక్ డ్రైవర్ల పరిస్థితి ఏమిటని అడుగుతారు. ట్రక్కుల పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నిస్తారు. విమర్శించేందుకు వారికి మరో అంశం దొరికినట్లే" అని వ్యాఖ్యానించారు. 2014కు ముందు ప్రత్యేక సరకు రవాణా కారిడార్ నిర్మాణంలో ఆశించిన పురోగతి జరగలేదని విమర్శించారు. గుజరాత్ పర్యటన సందర్భంగా వడోదరలో వేల కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నవసారిలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. అధికారం, వ్యవస్థలు, పదవులు ప్రజలకు సేవ చేసేందుకేనని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నామనే అహంకారం కాకుండా నిరంతరం ప్రజలకు సేవ చేయడమే తమ పార్టీ కార్యకర్తల లక్ష్యమని పేర్కొన్నారు. "విశ్రాంతి అనేది నిషిద్ధం" అన్నది కేవలం నినాదం కాదని, ప్రజాసేవలో నిరంతరం పనిచేసే విధానమని చెప్పారు. నవసారి జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలను మోదీ ప్రశంసించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో సాధారణ ప్రజలు భాగస్వాములైనప్పుడే వచ్చే మార్పు శాశ్వతంగా నిలుస్తుందని చెప్పారు. అలాంటి కార్యక్రమాలు సమాజంలో కొత్త విశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. నవసారిని పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న కృషిని అభినందించారు. ఒక జిల్లాను పోషకాహార లోపం నుంచి విముక్తం చేయడం ఎన్నికల్లో వచ్చే ఓట్ల కంటే ఎంతో విలువైన తల్లులు, కుటుంబాల ఆశీస్సులను అందిస్తుందని వ్యాఖ్యానించారు. క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న ప్రయత్నాలు భావితరాల ఆరోగ్యానికి పునాది వేస్తాయని పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న తొలినాళ్లను మోదీ గుర్తుచేసుకున్నారు. జూన్‌లో 44 డిగ్రీల తీవ్ర ఎండలోనూ బాలికల విద్య కోసం గ్రామాల్లో పర్యటించినట్లు తెలిపారు. చిన్నారులను పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులను ఒప్పించేందుకు చేసిన ప్రయత్నాలు తనకు రాజకీయ అధికారం కంటే ఎక్కువ సంతృప్తిని ఇచ్చాయని చెప్పారు. అభివృద్ధిపై విమర్శలు, రాజకీయ ఆరోపణలు ఎన్ని వచ్చినా యువత ఆకాంక్షలు, ప్రజల భాగస్వామ్యం, సత్యం ఆధారంగానే దేశం ముందుకు సాగుతుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# ప్రధాని భద్రతలో కలకలం



**మోదీ కార్యక్రమంలో నకిలీ గుర్తింపు కార్డుతో యువకుడు**

**వెంట వచ్చిన వ్యక్తి వద్ద తుపాకీ**

**ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**ముంబై, సెప్టెంబర్ 8 (చురకలు):** ప్రధాని నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు భద్రతా వర్గాలను ఉలిక్కిపడే ఘటన చోటుచేసుకుంది. ప్రధాని పాల్గొనాల్సిన కార్యక్రమ వేదిక వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరి వద్ద ప్రధానమంత్రి కార్యాలయానికి చెందినదిగా చూపుతున్న నకిలీ గుర్తింపు కార్డు లభించగా.. అతడితో వచ్చిన మరో వ్యక్తి వద్ద తుపాకీ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ముంబైలోని బాంద్రా–కుర్లా కాంప్లెక్స్‌లో ఉన్న నీతా ముఖేశ్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో మంగళవారం ప్రధాని మోదీ పాల్గొనే కార్యక్రమం నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో వేదిక పరిసరాల్లో రోహన్ పరేఖ్ (24) అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని భద్రతా సిబ్బంది గుర్తించినట్లు సమాచారం. అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా తాను ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన అధికారినని చెప్పినట్లు తెలుస్తోంది. అతడు చూపించిన గుర్తింపు కార్డును పరిశీలించగా అది నకిలీదిగా తేలినట్లు సమాచారం.

**'బాడీగార్డ్' వద్ద తుపాకీ**

రోహన్‌తో పాటు ఉన్న మరో వ్యక్తి గురించి పోలీసులు ప్రశ్నించగా అతడు తన బాడీగార్డ్ అని చెప్పినట్లు సమాచారం. అయితే ఆ వ్యక్తి వద్ద తుపాకీ ఉండటాన్ని గుర్తించిన పోలీసులు వెంటనే ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు, గుర్తింపు పత్రాలు, ఇతర వస్తువులను పోలీసులు పరిశీలిస్తున్నారు. తుపాకీకి చట్టబద్ధమైన లైసెన్స్ ఉందా? నకిలీ గుర్తింపు కార్డు ఎక్కడ తయారైంది? ప్రధానమంత్రి కార్యాలయం పేరుతో గుర్తింపు కార్డును ఎందుకు ఉపయోగించారు? ప్రధాని పాల్గొనే కార్యక్రమ వేదిక వద్దకు వీరు ఏ ఉద్దేశంతో వచ్చారు? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రధాని పాల్గొనే కార్యక్రమానికి ముందు నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో ఇద్దరు వ్యక్తులు వేదిక పరిసరాల్లో కనిపించడం భద్రతా వర్గాల్లో కలకలం రేపింది. ఘటన వెనుక ఉద్దేశం ఏమిటన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

**నా క్లయింట్‌ను తప్పుదోవ పట్టించారు..**

ఈ కేసులో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. రోహన్ పరేఖ్ తరఫున హాజరైన లాయర్ తన క్లయింట్ మోసపోయి ఉండొచ్చని ముంబై కోర్టులో వాదించారు. కోర్టు విచారణ సందర్భంగా రోహన్‌కు అధికారికంగా కనిపించే ఆఫర్ లెటర్, గుర్తింపు కార్డు, ప్రధాని మోదీ సంతకంతో ఉన్నట్లు చెబుతున్న ఒక లేఖ అందాయని లాయర్ తెలిపారు. ఇదే కాకుండా ప్రధాని కార్యాలయంలో అదనపు కార్యదర్శి పేరుతో ఉన్నట్లు చెబుతున్న ఓ ఈమెయిల్ కూడా రోహన్‌కు వచ్చినట్లు కోర్టుకు వెల్లడించారు. ఈ పత్రాలు, సంప్రదింపుల కారణంగానే తన క్లయింట్ నిజంగా పీఎంఓకు సంబంధించిన ఉద్యోగం పొందినట్లు నమ్మాడని ఆయన తరుఫు న్యాయవాది వాదించారు. ఎవరో వ్యక్తి రోహన్‌ను మోసం చేసి ఉండొచ్చని పేర్కొన్నారు. అయితే, రోహన్ చెబుతున్నవి నిజాలా? లేదా? , అతడి వద్ద లభించిన ఐడీ కార్డు నిజమైందా.? ఎవరు తయారు చేశారు? దీని వెనక ఎవరున్నారనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ముంబై కోర్టు రోహన్ పరేఖ్‌ను సెప్టెంబర్ 11 వరకు పోలీస్ కస్టడీకి పంపింది.

# టీచర్ల నియామకాల్లో అర్హతలేనివారికి 'నో ఎంట్రీ'


**సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు ■ నిర్దేశిత అర్హతలు తప్పనిసరి**

**విలీనం పేరుతో నిబంధనలు పక్కన పెట్టొద్దు ■ పారదర్శకత, మెరిట్‌కే ప్రాధాన్యం**

**విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యమన్న ధర్మాసనం**




**ఢిల్లీ, సెప్టెంబర్ 8 (చురకలు):** దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యావ్యవస్థలో నాణ్యతను కాపాడేందుకు అర్హత లేని వ్యక్తులను టీచర్లుగా నియమించకూడదని స్పష్టం చేసింది. ఆర్టీఈ, ఎన్సీటీఈ, యూజీసీ నిబంధనల ప్రకారం నిర్దేశించిన అర్హతలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారిని కొత్తగా నియమించడం మాత్రమే కాకుండా.. ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిని కూడా కొనసాగించడానికి వీల్లేదని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఉపాధ్యాయుల నియామకాల్లో విద్యార్థుల ప్రయోజనాలు, బోధనా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. ప్రభుత్వ సర్వీసుల్లోకి ఉపాధ్యాయులను విలీనం చేసే పేరుతో పారదర్శకమైన, పోటీతత్వ నియామక ప్రక్రియను పక్కన పెట్టడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎలాంటి పారదర్శక నియామక ప్రక్రియ లేకుండా.. అర్హతలు లేని వ్యక్తులను ప్రభుత్వ సర్వీసుల్లోకి తీసుకోవడాన్ని అంగీకరించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆర్టీఈ, ఎన్సీటీఈ, యూజీసీ నిబంధనలకు అనుగుణంగా అర్హతలు ఉన్నవారినే ఉపాధ్యాయులుగా నియమించాలని పేర్కొంది. అర్హత ప్రమాణాలను పాటించకుండా నియామకాలు చేపడితే విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. దీంతో టీచర్ల నియామకాల్లో ఇకపై నిబంధనలు, పారదర్శకత, మెరిట్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.




# ఐక్యరాజ్యసమితి కొత్త మ్యాప్

**అరుణాచల్, అక్సాయ్ చిన్‌లపై వేర్వేరు సరిహద్దు గీతలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 (చురకలు):** ఐక్యరాజ్యసమితి (యూఎన్) విడుదల చేసిన నూతన ప్రపంచ పటం భారత్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాల సరిహద్దుల విషయంలో భారత, చైనా దేశాల వాదనలకు అనుగుణంగా వేర్వేరు గీతలను (ఇండియన్ లైన్, చైనీస్ లైన్) చూపించడం వివాదానికి దారితీసింది. అయితే, ఈ ప్రాంతాలను చైనాలో భాగమని యూఎన్ అధికారికంగా ప్రకటించలేదని, కేవలం ఇరు దేశాల ప్రాదేశిక వాదనలను ప్రతిబింబించేలా ఈ గీతలను పొందుపరిచినట్లు తెలుస్తోంది. భూభాగాల పరిమాణాలను వాస్తవికంగా చూపించే లక్ష్యంతో యూఎన్ జనరల్ అసెంబ్లీ 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త మ్యాప్‌లో అరుణాచల్ ప్రదేశ్‌కు అస్సాం వైపు ఉన్న దక్షిణ సరిహద్దును 'చైనీస్ లైన్'గా, టిబెట్ వైపు ఉన్న ఉత్తర సరిహద్దును 'ఇండియన్ లైన్'గా చూపించారు. అలాగే లద్దాఖ్‌లోని అక్సాయ్ చిన్ ప్రాంతంలోనూ రెండు వేర్వేరు గీతలను పొందుపరిచారు. జమ్మూ కాశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉన్న లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్ఓసీ)ను చుక్కల గీతతో సూచిస్తూ, దీనిపై ఇంకా తుది ఒప్పందం కుదరలేదని వివరణ ఇచ్చారు. ఈ తీర్మానానికి భారత్ మద్దతు తెలిపినప్పటికీ, యూఎన్ మ్యాప్‌లలో ప్రదర్శించే సరిహద్దుల చిత్రీకరణను తాము ప్రత్యేకంగా ఆమోదించడం లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

## యూజీసీ-నెట్ పరీక్షకు 200 మీటర్ల పరిధిలో ఆంక్షలు

**సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 08, :**



సిద్దిపేట జిల్లాలో సెప్టెంబర్ 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఎన్‌టీఏ–యూజీసీ నెట్ పరీక్షను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు బీఎన్ఎస్ఎస్–2023లోని సెక్షన్ 163 కింద ఆంక్షలు విధించినట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట (అర్బన్) మండలం పొన్నాల గ్రామంలోని ఇందూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమికూడడాన్ని నిషేధించారు. కర్రలు, కత్తులు, లాఠీలు, ఇతర ఆయుధాలు లేదా హానికరమైన పరికరాలను తీసుకురావడంపై కూడా ఆంక్షలు విధించారు. అదేవిధంగా పరీక్ష జరిగే సమయంలో కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, సైబర్ కేఫ్‌లను మూసివేయాలని ఆదేశించారు. ఈ ఆంక్షలు సెప్టెంబర్ 9, 10 తేదీల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7:30 గంటల వరకు లేదా పరీక్ష పూర్తయ్యే వరకు అమల్లో ఉంటాయని కలెక్టర్ తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- **బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు, ఎమ్మెల్యేల అరెస్టులు అప్రజాస్వామికం**
- **టౌన్ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ షాహెద్**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**



ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హక్కును కాలరాస్తూ నియంతృత్వ పాలన సాగిస్తోందని సిద్దిపేట టౌన్ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ షాహెద్ విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం, బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడటం కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు, ఆందోళనలు ప్రజల హక్కులని, వాటిని అణచివేయడం ద్వారా ప్రజల గొంతును శాశ్వతంగా మూయలేరని అన్నారు.బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అరెస్టు చేసిన ఎమ్మెల్యేలను వెంటనే విడుదల చేయాలని ఎండీ షాహెద్ డిమాండ్ చేశారు.

## మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని పరామర్శించిన మంత్రులు, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**



మాజీ సీఎం కేసీఆర్ నివాసం ఎర్రవల్లి ఫాంహౌజ్ సమీపంలో మంగళవారం జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ గౌడ్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డికి మెరుగైన వైద్యం అందించాలని వారు వైద్యులకు సూచించారు. నర్సారెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై టీపీసీసీ చీఫ్, మంత్రులు ఆసుపత్రి వైద్యుల నుండి ఆరా తీశారు.

## 12న జాతీయ లోక్ అదాలత్

**డిఎల్ఎస్ఏ కార్యదర్శి మట్ట సరిత**

**కాక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి..**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**




జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ హైదరాబాద్ వారి ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ జగిత్యాల వారి ఆధ్వర్యంలో జిల్లా లోని అన్ని కోర్టులలో ఈ నెల 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, కుటుంబ తగాదాలకు సంబందించిన కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, మోటార్ వెహికల్ చట్టంకు సంబందించిన కేసులు, బ్యాంకు కేసులు, చిట్ ఫండ్ కేసులను ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించబడునని, కావున 12న కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ ద్వారా మీ యొక్క కేసులను పరిష్కరించుకునే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **స్పీకర్‌ను దూషించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం**
- **సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ డిమాండ్ చేశారు. సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్సీ సెల్ నాయకుడు బొమ్మల యాదగిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ పదవిని అవమానించేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా, కుటుంబ సభ్యులను ఉద్దేశించి పరుష వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు హుందాగా వ్యవహరించాలని సూచించారు. స్పీకర్‌ను దూషించిన ఎమ్మెల్సీలపై పోలీసులు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దళితుల పట్ల బీఆర్ఎస్ నాయకత్వానికి చిన్నచూపు ఉందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో దళితులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రజలు బీఆర్ఎస్‌ను ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా ఆ పార్టీ నాయకుల తీరు మారలేదని అన్నారు. అసెంబ్లీ సమావేశాలకు ఆటంకం కలిగిస్తూ బీఆర్ఎస్ నాయకులు అనవసర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారం కోసం కేసీఆర్, కేటీఆర్,



హరీశ్‌రావు రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గంప మహేందర్ రావు, బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి, దాస అంజయ్య, కలిముద్దీన్, రాశాద గయాజుద్దీన్, విజయ్, డానియల్, వహాబ్, సంతోషి, బర్మా రామచంద్ర, రాములు, రాజ్ బహదూర్ రెడ్డి, వంశీ, సనా, రజినీ, లహరి, దస్తగీర్, దేశెట్టి నరేష్, పవన్, చందు, శ్రీనివాస్, కర్ణాకర్, రఘుపతి, అనిల్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన

**ఎమ్మెల్సీ దిష్టిబొమ్మ దహనం**

**నంగునూరు, సెప్టెంబర్ 08, :**



అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ నంగునూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. రాంపూర్ ఎక్స్‌రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలు చేయడం ఖండనీయమన్నారు. ప్రజాప్రతినిధులు రాజ్యాంగ పదవులకు గౌరవం ఇవ్వాలని, ప్రజాస్వామ్య వేదికలపై సంయమనం పాటించాలని సూచించారు. తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ సహించబోదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపోల్ రాజ్ బహదూర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ రంగు అశోక్, ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్లు ఎండీ ఇమ్రాన్, గొట్టం రంగారెడ్డి, తిప్పని రాజేశ్వర్, జీవన్ నాయక్, ప్రభాకర్, చేర్యాల కృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ కరెడ్ల వెంకట్ రెడ్డి, కాటం కనకయ్య, వల్లద్రి రవీందర్ రెడ్డి, పదిరే శ్యామ్ రెడ్డి, పిల్లి మహేష్, బర్రె సంతోష్ రెడ్డి, బోజు రాములు, గడ్డం కరుణాకర్ రెడ్డి, నాయిని సంపత్ రెడ్డి, మాదే మహేష్, జిన్నా, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాల నుంచి సంపద సృష్టిపై వర్క్‌షాప్

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వ్యవస్థాపకత్వ అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో 'వ్యర్థాల నుంచి సంపద' అనే అంశంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి జీవన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యర్థ పదార్థాలను సద్వినియోగం చేసుకుని సంపద సృష్టించే అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నిత్యజీవితంలో ఉపయోగించే వస్తువుల నుంచి వెలువడే వ్యర్థాలు గాలి, నీరు, పర్యావరణం, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. వ్యర్థాల ప్రతికూల ప్రభావాలను తగ్గిస్తూ, వాటిని ఉపయోగించి సంపదను సృష్టించే వినూత్న ఆలోచనలను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఇలాంటి వర్క్‌షాప్‌లు దోహద పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ నిఖిల్ రెడ్డి, మెల్లో కార్బన్ క్లైమేట్ అగ్రి ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి భార్గవి మందాడి, శిక్షకుడు ధనుంజయ్, జిల్లా వ్యవస్థాపకత్వ అభివృద్ధి మేనేజర్ మన్నె శిరీష, అసిస్టెంట్ మేనేజర్ రాజు ప్రసంగించారు. వ్యర్థ పదార్థాలతో తయారు చేయగల ఉత్పత్తులు, వాటి మార్కెటింగ్ విధానాలు, వ్యాపార స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు



పాల్గొని సర్టిఫికెట్లు పొందారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్వేత, డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణాదేవి, వ్యవస్థాపకత్వ అభివృద్ధి విభాగాధిపతి హరిప్రసాద్‌తో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు

- **290 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**



జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మెదక్ రోడ్డులోని కళ్యాణ మండపంలో దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వివిధ రకాల వైకల్య సమస్యలతో 290 మంది దివ్యాంగులు శిబిరానికి హాజరయ్యారు. శిబిరంలో ఆర్థోపెడిక్, న్యూరో సర్జన్, రేడియాలజీ వైద్యులు దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ధనరాజ్ శిబిరాన్ని పరిశీలించి, ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శిబిరానికి వచ్చిన వారందరి పరీక్షలు పూర్తయ్యే వరకు వైద్యులు అందుబాటులో ఉండి సరైన వైద్య నిర్ధారణ చేయాలని సూచించారు. అదనపు డీఆర్‌డీఓ సుధీర్ మాట్లాడుతూ శిబిరానికి వచ్చిన దివ్యాంగులు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు పూర్తిచేసుకున్న వారికి వెరిఫికేషన్ ప్రక్రియ అనంతరం యూడీఐడీ, సదరం ధ్రువీకరణ పత్రాలు వారి ఇళ్లకే చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శిబిరంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య పరీక్షలు నిర్వహించడంపై దివ్యాంగులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఆర్థోపెడిక్ వైద్యులు కిషోర్, రాజ్‌కుమార్, సుశాంత్, అమన్‌దీప్, న్యూరో సర్జన్ మణిదీప్‌రావు, హౌస్ సర్జన్లు, ఇంటర్న్‌లు, రేడియాలజీ సిబ్బంది, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, జిల్లా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- **బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఎల్పీ విప్, హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గారి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ.49,67,000 విలువైన 129 సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ప్రభుత్వ సహాయం అందేలా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సీఎంఆర్ఎఫ్



లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# రక్షణ కల్పిస్తున్న పోలీసులపైనే బిఆర్ఎస్ దాడులు

- కేఆర్ ఆదేశాలతోనే స్పీకర్ ను దూషించిన ఎమ్మెల్సీ తాతా మధు
- గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలి
- తాతా మధు శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలి
- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, :** ప్రజా ప్రతినిధులు, సమాజానికి రక్షణ కల్పిస్తున్న పోలీసులపైనే బిఆర్ఎస్ దాడులు చేస్తుందాని, సోమవారం అసెంబ్లీ వద్ద జరిగిన సంఘటన సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసిందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఎర్రవల్లి శివారులో మంగళవారం జరిగిన తొక్కిసలాటలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ఆదేశాలతోనే అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును ఎమ్మెల్సీ సభ్యత్వం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా దళితులు, మహిళల పట్ల బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్న తీరు సిగ్గుచేటని, మహిళా పోలీసుల ముందే చొక్కాలు విప్పడం వారి నైజం, సంస్కృతిని బహిర్గతం చేస్తుందని ఎద్దేవా చేశారు.



చేసిన తప్పు ఒప్పుకోకుండా బిఆర్ఎస్ నేతలు ప్రజల్ని రెచ్చగొడుతున్నారని, స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలతో దళిత సమాజం ఆగ్రహిస్తున్న విషయాన్ని గమనించాలని సూచించారు. ప్రాయశ్చిత్తం కోసం కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఫాంహౌజ్ వద్ద చావుడప్పు మోతలతో నిరసన తెలిపినట్లు చెప్పారు. ఇప్పటికైనా కేసీఆర్ బయటకు వచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు అసెంబ్లీకి హాజరుకావాలని పేర్కొన్నారు.

# సర్-2026 కార్యక్రమంలో బీఎల్ఏలు, సీనియర్ నాయకులకు ఘన సన్మానం

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, :** ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు మంగళవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సర్-2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 277వ డివిజన్ మహాదేవపురం–సిద్దనోళ్ల సంజీవరెడ్డి, 278వ డివిజన్–దేగల సతీష్ బాబు, 291వ డివిజన్–బట్ట పలకృష్ణ, 293వ డివిజన్–సంతోష్ ముదిరాజ్‌తో పాటు ఆయా డివిజన్ల అధ్యక్షులు, ఇన్చార్జులు, బీఎల్ఏలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కొలన్ హన్మంత్



రెడ్డి, డీసీసీ కమిటీ సభ్యులు సర్-2026 కార్యక్రమంలో అంకితభావంతో పనిచేసిన బీఎల్ఏలు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సర్–2026 కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ప్రతి బీఎల్ఏ, సీనియర్ నాయకుడు, డివిజన్ అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ఇదే నిబద్ధతతో పనిచేస్తూ కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి కార్యకర్తలు, నాయకుల సమన్వయంతో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తల సమన్వయంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఆరోగ్య భద్రతకు సీఎం రిలీఫ్ ఫండ్

- పేదల ఆరోగ్యానికి బీఆర్ఎస్ అండ
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీలు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, :** అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన ఎల్ఓసీ పత్రాలను మంగళవారం చింతల్‌లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జీడిమెట్ల 132వ డివిజన్‌కు చెందిన నిరుపేద లబ్ధిదారులకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "పేద ప్రజల ఆరోగ్య భద్రతే మా ప్రధాన లక్ష్యం. అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రతి కుటుంబానికి అండగా నిలవడం మా బాధ్యత. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరుపేదలకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు ప్రజల తరఫున కృతజ్ఞతలు" అని అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై, వారికి అవసరమైన సమయంలో అండగా నిలవడం బీఆర్ఎస్ నాయకులు,



కార్యకర్తల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజాసేవలో ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటలు నిలబెట్టుకోవాలి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆగ్రహం

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగం మీద ప్రమాణం చేసి మాట తప్పిన రేవంత్ రెడ్డికి బుద్ధిరావాలని మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ రేవంత్



రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికల ముందు ప్రజలకు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చెయ్యకుండా ప్రజలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. మహిళలకు, వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం అలాగే వారికి గుర్తింపు కార్డులు, తెలంగాణ ఉద్యమ కారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టమైన కార్యాచరణ ఎందుకు చేపట్టలేదని వారు ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిఎడల తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకొని మరింత ఉధృతమైన ప్రజా ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ పార్లమెంటు ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, కరీంనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ అంకం శివరాణి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీరాముల రమేష్, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, జిల్లా పార్టీ సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నాప్ కేసులో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్, గ్రామస్తులకు ఎస్పీ అభినందనలు

- నేరాల నియంత్రణ, ఛేదనలో ప్రజల సహకారం ఎంతో కీలకం
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, :** బీర్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కిడ్నాప్ కేసును అత్యంత వేగంగా ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్ మల్లేష్, అలాగే పోలీసులకు విలువైన సహకారం అందించిన వెల్గటూర్ మండలం రాజారాంపల్లి గ్రామానికి చెందిన సతీష్, ఏడుకొండలులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి బహుమతులు అందజేశారు.

### గంటల్లోనే కిడ్నాప్ కేసు ఛేదన

వివరాల్లోకి వెళితే రేకులపల్లి గ్రామానికి చెందిన బర్ల లక్ష్మీనారాయణను హనుమకొండకు చెందిన కొందరు వ్యక్తులు డబ్బులు అప్పుగా తీసుకుని తిరిగి చెల్లించలేదనే ఆరోపణతో రెండు కార్లలో వచ్చి కిడ్నాప్ చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నిందితుల కదలికలను గుర్తించారు. ఈ క్రమంలో రాజారాంపల్లి సమీపంలో స్థానికులు సతీష్,



ఏడుకొండలు అందించిన సహకారంతో ఒక కారును అడ్డుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో కారులో ఉన్న బాధితుడి ఆచూకీని కూడా పోలీసులు గుర్తించి సురక్షితంగా రక్షించారు. అనంతరం బాధితుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణతో పాటు నేరాలను వేగంగా ఛేదించడంలో ప్రజల సహకారం ఎంతో కీలకమని అన్నారు. ప్రజల సమాచారం, సహకారం నేరాల నియంత్రణతో పాటు కేసుల దర్యాప్తులో కూడా కీలకంగా మారుతుందని, ఈ కేసులో రాజారాంపల్లి గ్రామస్తులు సతీష్, ఏడుకొండలు అందించిన సహకారం పోలీసుల దర్యాప్తులో ఎంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు పోలీసులతో సమన్వయంతో వ్యవహరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, కొన్ని గంటల్లోనే కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం

## కాంగ్రెస్ నేతల ప్రత్యేక పూజలు



**చిన్నకోడూరు, సెప్టెంబర్ 08, :** చిన్నకోడూరు మండలం విఠలాపూర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవానికి మంగళవారం చిన్నకోడూరు, నంగునూరు మండలాల ఏఎంసీ చైర్మన్లు మీసం మహేందర్ యాదవ్, దేవులపల్లి యాదగిరి, ఆర్టీఏ మెంబర్ సూర్య వర్మ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నాగరాణి ఎల్లం, గ్రామస్తుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆశీస్సులతో విఠలాపూర్ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. గ్రామంలో పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ యాదవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సందబోయిన పర్శరాం యాదవ్, సీనియర్ నాయకులు చంద్, కొమ్ము ప్రశాంత్, నారాయణ్ రెడ్డి, రాజిరెడ్డి, వెంకట్ రెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నర్మెట్టలో ఘనంగా ఎల్లమ్మ బోనాలు

## గౌడ సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



**నంగునూరు, సెప్టెంబర్ 08, :** సిద్దిపేట నియోజకవర్గం నంగునూరు మండలంలోని నర్మెట్టలో శ్రావణమాసం సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలను అందంగా అలంకరించి ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయు రారోగ్యాలతో ఉండాలని ఎల్లమ్మ తల్లిని ప్రార్థించారు. బోనాల వేడుకలతో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు యాదగిరి గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, చంద్రం గౌడ్, ఉప్పలయ్య గౌడ్, మహేందర్ గౌడ్, సత్తయ్య గౌడ్, సురేశ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజు గౌడ్‌తో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు. పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# బుడ్డా లింగం గౌడ్ సేవలు మరువలేనివి

## ఘనంగా 8వ వర్ధంతి వేడుకలు

## మాజీ కార్పొరేటర్ బుడ్డా విజయ శేఖర్ గౌడ్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, :** కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్, స్వర్గీయ బుడ్డా లింగం గౌడ్ ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన కుమారుడు, రంగారెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బుడ్డా విజయ శేఖర్ గౌడ్ అన్నారు. మంగళవారం బుడ్డా లింగం గౌడ్ 8వ వర్ధంతి సందర్భంగా విజయనగర్ కాలనీ, కుత్బుల్లాపూర్ చౌరస్తాలోని ఆయన విగ్రహాలకు కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి బుడ్డా విజయ శేఖర్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు రాజకీయ ఓనమాలు దిద్దించింది తన తండ్రి బుడ్డా లింగం గౌడ్ అని అన్నారు. తండ్రి చూపిన బాటలో నడుస్తూ పేద ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని తెలిపారు. తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ, నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తూ ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, పార్టీ శ్రేణులు, అభిమానులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని బుడ్డా లింగం గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు.

# రైతులు, విద్యార్థుల సమస్యలను విస్మరించిన ప్రభుత్వం

**నంగునూరు, సెప్టెంబర్ 08, :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు వల్లపు రెడ్డి రజనీకర్ రెడ్డి విమర్శించారు. నంగునూరు మండల బీజేపీ అధ్యక్షుడు చౌదేచర్ల వెంకటరామిరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అరకొరగా విద్యుత్ సరఫరా చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రైతుల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించామని చెప్పుకునే ప్రభుత్వం



రైతులకు కాల్వల ద్వారా నీరు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. అసెంబ్లీ ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు వ్యవహరించిన తీరుపైనా రజనీకర్ రెడ్డి విమర్శలు చేశారు. మహిళా ఎమ్మెల్యేలు ఉన్న సమయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు టీషర్ట్ విప్పి నిరసన వ్యక్తం చేయడం, స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో అసెంబ్లీలోనే సమస్యలను ప్రస్తావించాలి తప్ప, బయట ఇలా ప్రవర్తించడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు ఆధ్వర్యంలో 22ఏ భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలపై నిర్వహిస్తున్న ఆందోళనలు ప్రజల్లోకి వెళ్లకుండా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసి నాటకం ఆడుతున్నట్లుగా అనిపిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతి రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కోల సతీష్, మండల కోశాధికారి బూరుగు శ్రీనివాస్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యుడు జీడిపల్లి రజనీకా రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు ఎన్నరాజయ్య, గంధం పరమేష్ రెడ్డి, సల్ల సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్నను దర్శించుకున్న హైడ్రా కమీషనర్ రంగనాథ్

- కుటుంబసమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు

**చొప్పదండి/కొండగట్టు, సెప్టెంబర్ 08, :** జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆంజనేయస్వామిని మంగళవారం హైడ్రా కమీషనర్ ఎ.వి. రంగనాథ్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. అంజనా రెడ్డి పూర్ణకుంభంతో వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రంగనాథ్ ని శ్రీ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేసి అర్చకులచే ఆశీర్వచనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగిత్యాల డిఎస్పి పురుషోత్తం రెడ్డి, మల్యాల సిఐ రాజు కుమార్, మల్యాల ఎస్ఐ



సందీప్, కొడిమ్యాల ఎస్ఐ నరేష్, ఆలయ ప్రధాన అర్చకులు జితేంద్ర ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు రంజీవస్వామి, ఆలయ పర్యవేక్షకులు సునీల్, పరిశీలకులు అశోక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి తావులేని పోలీస్.. ఆత్మీయతకు నిలువెత్తు రూపం..

- ప్రతికంఠం కృష్ణమరాజు శతజయంతి సందర్భంగా రాష్ట్ర భట్రాజ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు నివాళి

**హైదరాబాద్, సెప్టెంబర్ 08, :** నిజాయితీ, నిబద్ధత, సేవాభావానికి ప్రతీకగా నిలిచిన పోలీస్ అధికారి, తన పెద్ద చిన్నాన్న కీర్తిశేషులు ప్రతికంఠం కృష్ణమరాజు శతజయంతి వేడుకలు (1926-2026) జరుపుకోవడం గర్వకారణమని తెలంగాణ రాష్ట్ర భట్రాజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతికంఠం పూర్ణచందర్ రాజు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కృష్ణమరాజు సేవలను, జీవిత విశేషాలను స్మరించుకున్నారు.

## ఉన్నత విద్య కోసం ఆనాడే పట్టుదల

పూర్వపు వరంగల్ జిల్లా, జనగామ తాలూకా కోడూరు గ్రామానికి చెందిన రాధమ్మ, సోమరాజు దంపతులకు కృష్ణమరాజు జన్మించారు. పెద్ద కుటుంబంలో పెరిగిన ఆయన చిన్ననాటి నుంచే చదువుపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. జనగామలో ప్రాథమిక విద్య, హన్మకొండలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పట్టభద్రుడైన తన కుటుంబంలో తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారని పూర్ణచందర్ రాజు తెలిపారు. అనంతరం న్యాయశాస్త్రంలోనూ పట్టా పొందారని పేర్కొన్నారు.

## పోలీస్ శాఖలో చెరగని ముద్ర

1960లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పోలీస్ శాఖలో ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన కృష్ణమరాజు.. అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేసి చివరకు అడిషనల్ ఎస్పీగా పదవీ విరమణ చేశారు. హైదరాబాద్ మూసారాంబాగ్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సమయంలో ప్రజల నోట "సర్కిల్ సాబ్" గా సుపరిచితులయ్యారని పూర్ణచందర్ రాజు గుర్తుచేశారు. ఆ రోజుల్లో పోలీస్ శాఖ అంటే ప్రజల్లో భయం ఉండేదని, అయితే కృష్ణమరాజు వద్దకు వెళితే తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ప్రజల్లో ఉండేదన్నారు. తన మొత్తం ఉద్యోగ జీవితంలో అవినీతికి ఏమాత్రం తావివ్వకుండా నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించారని తెలిపారు. లాఠీ కంటే మాటకే విలువ ఇచ్చే అధికారిగా, పెద్దలను గౌరవిస్తూ, చిన్నలను ఆదరిస్తూ అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం న్యాయవాదిగా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారని తెలిపారు. ఆచార్య బిరుదురాజు రామరాజుతో ఆయనకు సన్నిహిత అనుబంధం, బాల్య స్నేహం ఉండేదని పూర్ణచందర్ రాజు వివరించారు.

## కుటుంబానికి పెద్ద దిక్కు.. సమాజానికి మార్గదర్శి..

ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడినప్పటికీ తన మూలాలను కృష్ణమరాజు ఎన్నడూ మర్చిపోలేదని పూర్ణచందర్ రాజు అన్నారు. కుటుంబ సభ్యులకే కాకుండా స్నేహితుల పిల్లలను సైతం చేరదీసి వారికి ఆశ్రయం కల్పించి, విద్యాబుద్ధులు చెప్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప మానవతావాది అని కొనియాడారు. ఆయన ఇల్లు ఒక కుటుంబానికి ఆలయంగా, ఎందరికో ఆశ్రయంగా నిలిచిందని పేర్కొన్నారు.

## స్వగ్రామ అభివృద్ధికి విశేష సహకారం

తన స్వగ్రామమైన కోడూరు అభివృద్ధితో పాటు విద్యారంగానికి తన వంతు సహాయం అందిస్తూ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారని పూర్ణచందర్ రాజు తెలిపారు. సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు.

## భావితరాలకు సజీవ పాఠ్యాంశం

1926లో ప్రారంభమైన కృష్ణమరాజు జీవన ప్రయాణం.. ఒక వ్యక్తి ఎలా జీవించాలి, ఒక అధికారి ఎలా విధులు నిర్వర్తించాలి, ఒక పెద్ద కుటుంబాన్ని, సమాజాన్ని ఎలా ఆదుకోవాలనే విషయాలను నేర్పే సజీవ పాఠ్యాంశమని పూర్ణచందర్ రాజు పేర్కొన్నారు. కృష్ణమరాజు భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన నాటిన నిజాయితీ, ఆత్మీయత, సేవాభావం అనే విత్తనాలు





నేడు కుటుంబంలో వటవృక్షాలుగా వికసిస్తున్నాయని అన్నారు. శతజయంతి సందర్భంగా ఆ మహనీయునికి మనసారా నివాళులర్పిస్తూ, ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన గౌరవమని పూర్ణచందర్ రాజు పేర్కొన్నారు.

## కుటుంబ నేపథ్యం..

ప్రతికంఠం కృష్ణమరాజుకు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమార్తె విజయలక్ష్మి భర్త డా. దేవరాజు మదన్ మోహన్ రాజు కుటుంబంతో కలిసి లండన్‌లో స్థిరపడి వైద్యులుగా సేవలందిస్తున్నారు. రెండో కుమార్తె వసుంధర భర్త బిరుదరాజు అశోక్ రాజు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. మూడో కుమార్తె అరుంధతి భర్త డా. చెన్నమాధవుని దామోదర్ రాజు వ్యవసాయ శాఖలో ప్రముఖ శాస్త్రవేత్తగా కొనసాగుతున్నారు. పెద్ద కుమారుడు పద్మనాభ రాజు పోలీస్ శాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఇటీవలే మృతిచెందారు. రెండో కుమారుడు శ్యాం సుందర్ రాజు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. మూడో కుమారుడు గుణవర్ధన్ రాజు సాఫ్ట్‌వేర్ కంపెనీలో వైస్ ప్రెసిడెంట్‌గా విధులు కొనసాగిస్తున్నారు. ప్రతికంఠం కృష్ణమరాజు అందించిన సేవలు, చూపిన విలువలు, ఆయన ఆచరించిన నిజాయితీ, మానవతా దృక్పథం భావితరాలకు దిక్సూచిగా నిలవాలని ఆకాంక్షిస్తూ పూర్ణచందర్ రాజు ఘన నివాళులర్పించారు.

# నల్ల పోచమ్మ తల్లిని దర్శించుకున్న కూన శ్రీనివాస్ గౌడ్



- ఘనంగా బోనాల మహోత్సవాలు.. భక్తులకు అన్నదానం

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, :** చింతల్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో పునర్నిర్మించిన శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో బోనాల మహోత్సవాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులు, దీవెనలు, కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో బోనాల మహోత్సవాలను ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను కూన శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కూన శ్రీనివాస్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, నరసింహారావుతో పాటు ఆలయ కమిటీ నిర్వాహకులు ముత్యపాక నరసింహారావు, దాసరి వెంకటేష్, మేకల కుమార్, గోపాల్, పాండు తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్‌కు ఉద్యోగులు తరలిరావాలి

- సెప్టెంబర్ 10న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- జేఏసీ నాయకుల పిలుపు

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీజేఈజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. చలో హైదరాబాద్ కార్యక్రమం ప్రచారంలో భాగంగా మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని డీఎంహెచ్ఓ కార్యాలయ ఆవరణలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల జేఏసీ



ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. టీజేఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. జిల్లా జేఏసీ చైర్మన్ అనుగంటి రాజేశం, సెక్రటరీ ఐళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ నర్సింగరాజు, జ్యోతి, సీహెచ్ఓలు, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్లు శ్రీధర్, డిపీఓ రాజేంద్ర, రవీందర్ రాథోడ్, సీనియర్ అసిస్టెంట్లు కుత్బోద్దీన్, సుజాత, ప్రియదర్శిని, కృష్ణా, జూనియర్ అసిస్టెంట్లు ప్రభాకర్, మహేందర్, సాగర్, సతీష్‌కుమార్, నరేందర్ రాజేందర్, పోచమల్లు, నాగరాజు, హజార్, శరత్, వంశీకృష్ణ, శామ్సుందర్, భాను, లవ్ కుమార్, వేణుగోపాల్, మహేశ్, రాజకుమార్, శ్రీనివాస్, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన సూపర్వైజర్లు , ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు
- మూడు మండలాలలో సర్వసభ్య సమావేశం
- పాల్గొన్న మెదక్ ఎంపీ రఘునందన్ రావు
- గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడి
- అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచన
- విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరించిన ఎంపీ





**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 08, :** ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసి పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక, అక్బర్ పేట-భూంపల్లి, మిరుదొడ్డి మండల పరిషత్ కార్యాలయాలలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు తమ గ్రామాల్లో ఉన్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి గ్రామ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఎవరైనా ప్రజాప్రతినిధులు గ్రామంలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కారంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని, అధికారులతో ప్రజాప్రతినిధులు సామరస్యంగా మాట్లాడి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు. సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు తీసుకువచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ లు పాల్గొన్నారు.

# ప్రభుత్వం వెంటనే పెండింగ్ డిమాండ్లు పరిష్కరించాలి

- టీజీఈజేఏసీ డిమాండ్
- చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

**అక్బర్ పేట-భూంపల్లి, సెప్టెంబర్ 08, :** టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్ ను మంగళవారం అక్బర్ పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆరు ప్రధాన డిమాండ్ల సాధన కోసం చలో హైదరాబాద్ కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. జులై 2023 నుండి రావాల్సిన పీఆర్సీని, పెండింగ్ లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు నోటిఫికేషన్ వచ్చి సాంకేతిక కారణాల వల్ల ఆ తర్వాత నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, ఆరోగ్య కార్డులు అన్ని ఆసుపత్రుల్లో అమలయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాలరాజు, సుమతి, శివప్రసాద్, స్వామి, ఉపాధ్యాయ సంఘం నాయకులు ర్యాకం మల్లేశం, గూడూరి శివాజీ, పెరుమాండ్ల శ్రీనివాస్, బాలకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# దమ్మపేటలో కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసన ర్యాలీ

- ఎమ్మెల్సీ తాతా మధు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసన
- చావు డప్పులతో కేసీఆర్, తాతా మధు దిష్టి బొమ్మల దహనం



**దమ్మపేట, సెప్టెంబర్ 08, :**
దమ్మపేట మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌పై బిఆర్ఎస్ కి చెందిన ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుండి బస్టాండ్ వరకు చావు డప్పులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్, తాతా మధుల దిష్టి బొమ్మలను దహనం చేయడాన్ని పోలీసులు అడ్డుకొని కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నప్పటికీ కాంగ్రెస్ శ్రేణులు నడిరోడ్డుపై దహనం చేసి డౌన్ డౌన్ కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. అడ్డుకున్న పోలీసులను పోలీస్ జులుం నశించాలని నినాదాలు చేశారు. తదనంతరం వైఎస్ఆర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి దళిత స్పీకర్ పై అమానుష వ్యాఖ్యలు సిగ్గుచేటని, స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచే విధంగా బిఆర్ఎస్ నాయకుడు వ్యాఖ్యలు చేయడం సరికాదని, స్పీకర్ పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోని, క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు సత్యప్రసాద్, జిల్లా కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శి పొదిలి జ్యోతి, జిల్లా దిశ కమిటీ సభ్యురాలు సొంగా ఏసుమణి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కక్కిరాల రమేష్ డిమాండ్ చేశారు, శాసనసభ స్పీకర్ పదవి రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవుల్లో ఒకటని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు తగదని అన్నారు. రాజకీయ విమర్శలు చేయడంలో అభ్యంతరం లేకపోయినా, రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉన్నాయని సీనియర్ మండల నాయకులు పగడాల రాంబాబు, వాసం శ్రీను, బొల్లికొండ నాగేశ్వరరావు, అత్తులూరి వెంకట రామారావు, కూరం అర్జునరావు, గుజ్జుల శ్రీనివాసరావు, చింతలపాటి మురళీ, ముళ్ళపూడి వెంకటేశ్వరరావు, కొవ్వలి వినోద్ కుమార్, వనమాల శ్రీనివాసరావు, పానుగంటి లక్ష్మణ్ గౌడ్, రొయ్యల కుమార్ ఈశ్వరప్రగడ నాగభూషణం, చిలకా శ్రీను, జెట్టి వెంకటేశ్వరరావు, కొయ్యల ప్రసాద్ నిరసనను కొనసాగించి ఎమ్మెల్సీ తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ పదవిని అవమానించే విధంగా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే ప్రభుత్వం ఉపేక్షించ కూడదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నశెట్టి చిట్టిబాబు, ముక్తేశ్వరరావు, దేవయ్య, పగడాల కృష్ణారావు, వేముల శ్రీను, గట్ల సర్వేశ్వరరావు, నాగరాజు, పిట్టల శ్రీనివాసరావు, షేక్ రఫీ, రషీద్, అన్నవరపు నాగేంద్రరావు, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దుబ్బాకలో టెన్షన్.. రాస్తారోకో..

- సీఎం ఫ్లెక్సీ దగ్ధంకు యత్నం
- కాంగ్రెస్ సర్కార్ కు వ్యతిరేకంగా మహిళలు, బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన
- సీఎం ఫ్లెక్సీ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**
కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుబ్బాకలో మంగళవారం మహిళలు, బీఆర్ఎస్ నాయకులు నిరసన ర్యాలీ, రాస్తారోకో చేపట్టారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఇందిరమ్మ రాజ్యం అంటే మహిళలను అవమానించడమేనా అంటూ మున్సిపల్ చైర్ పర్సన్ సంగీత ప్రశ్నించారు. అసెంబ్లీకి వెళ్లిన మహిళా ఎమ్మెల్యేల చీరలు లాగడం, ఎమ్మెల్యేల గొంతు పట్టి నొక్కడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీని దగ్ధం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో మహిళలు వాగ్వాదానికి దిగారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల జోలికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పోలీసులతో అసెంబ్లీకి ప్రజా ప్రతినిధులను రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ప్రజల సమస్యలను తెలిపేందుకు వెళ్లిన ఎమ్మెల్యేలపై దాడులు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.



# చిన్నారుల వైద్యానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ కుమార్
- ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే

**హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 08, :**
గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆర్థిక స్థోమతలేక చికిత్స చేయించుకోలేని పేద కుటుంబాలకు ప్రభుత్వ సహకారంతో గుండె శస్త్రచికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయి అన్నారు. ఈ నేపథ్యంలో జగిత్యాల నియోజకవర్గానికి చెందిన కొనాపూర్ కి చెందిన పంగ విజయ్ కూతురుకు గుండె శస్త్రచికిత్సలు అవసరమవడంతో, వారికి ఆర్థిక భారం లేకుండా చికిత్స అందించేందుకు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రభుత్వ సహకారంతో సీఎం సహాయనిధి ద్వారా ఎల్ఓసి అందజేశారు. తాళ్ళ ధర్మారం గ్రామానికి చెందిన గంగాదరీ సుమన్ కొడుకు గుండె శస్త్ర చికిత్స ఉండగా వారినీ పరామర్శించారు. చిన్నారుల కుటుంబాలకు వైద్యఖర్చుల విషయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) లో చిన్నారుల గుండె శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ప్రత్యేక వైద్య బృందం ఏర్పాటైందని, లండన్‌కు చెందిన పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ రమణ రావు ధన్నాపూనేని, ఆర్మ్డ్ ఫోర్స్ వైద్యులు డాక్టర్ నిఖిల్, డైరెక్టర్ నిమ్స్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, డాక్టర్ ప్రవీణ్ ల సహకారంతో ఈ ప్రత్యేక శస్త్రచికిత్స కార్యక్రమం వారం పాటు కొనసాగుతోందని, దాదాపు 25మంది చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు వైద్య బృందం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు. చిన్న వయసులోనే గుండె సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు అత్యాధునిక వైద్య సేవలు అందించడంతో పాటు, అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు.





# బొబ్బాయిపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి



- డిపో మేనేజర్ కు సర్పంచ్ సంపత్ వినతి

**గజ్వేల్ ప్రతినిధి (కుకునూరుపల్లి), సెప్టెంబర్ 08, :**
గజ్వేల్ నియోజకవర్గం కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ సర్పంచ్ సంపత్ యాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, గ్రామ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బొబ్బాయిపల్లికి ఆర్టీసీ బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని కోరినట్లు వారు పేర్కొన్నారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించి త్వరలో బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పాఠశాలలకు ఫైర్ ఎన్ఓసీ నుంచి మినహాయింపు ఇవ్వాలి

- ఫైర్ శాఖ డైరెక్టర్ జనరల్‌కు విజ్ఞప్తి చేసిన ట్రస్మా ప్రతినిధి బృందం

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**
ప్రస్తుతం నిర్వహణలో ఉన్న పాఠశాలలకు ఫైర్ ఎన్ఓసీ నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాల యాజమాన్య సంఘం (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్. రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం నానక్‌రామ్‌గూడలోని తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్‌ను ట్రస్మా ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. ఫైర్ ఎన్ఓసీ పొందడంలో ఆర్థికంగా వెనుకబడిన పాఠశాలల నిర్వాహకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను డీజీ దృష్టికి తీసుకెళ్లారు. నూతన నిబంధనల రూపకల్పనలో పాఠశాల



యాజమాన్యాల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కొనసాగుతున్న పాఠశాలలకు కూడా ఫైర్ ఎన్ఓసీ తప్పనిసరి చేయడం సరికాదని ఎస్.ఎన్. రెడ్డి పేర్కొన్నారు. పాఠశాల నిర్వాహకుల నుంచి స్వీయ ధ్రువీకరణ (సెల్ఫ్ డిక్లరేషన్) తీసుకుంటే సరిపోతుందని సూచించారు. డే స్కాలర్ పాఠశాలలను కమర్షియల్ కేటగిరీలో పరిగణించవద్దని కోరారు. అలాగే సెట్‌బ్యాక్ నిబంధనల్లో సడలింపు ఇవ్వాలని, ఎన్ఓసీ సర్టిఫికేషన్ ఫీజును నామినల్‌గా నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి పాఠశాలలో ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలను ఇతర వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, సినిమా థియేటర్లతో పోల్చి చూడకూడదని, వాటి నిర్వహణ విధానాలకు పాఠశాలలకు మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని తెలిపారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పాఠశాలలను ప్రత్యేక కేటగిరీగా గుర్తించి, ఫైర్ సేఫ్టీ నిబంధనలను సరళీకృతం చేయాలని ట్రస్మా ప్రతినిధులు కోరారు. ఇందుకు డైరెక్టర్ జనరల్ సానుకూలంగా స్పందించినట్లు ఎస్.ఎన్. రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా కార్యదర్శి కె. అనిల్ కుమార్, కోశాధికారి కె. శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలి

- ఎంపీ రఘునందన్ రావుకి వినతిపత్రం అందజేసిన ఉపసర్పంచ్

**గజ్వేల్ ప్రతినిధి (కుకునూరుపల్లి), సెప్టెంబర్ 08 :**
గజ్వేల్ నియోజకవర్గం కుకునూరుపల్లి మండల పరిధిలోని తిప్పారం గ్రామ ఉపసర్పంచ్ ఈసాల నవీన్ మంగళవారం మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావుని కలిశారు. గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో భవనానికి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఉపసర్పంచ్ మెదక్ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈసాల నవీన్ మాట్లాడుతూ విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని తక్షణమే మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ ని కోరినట్లు తెలిపారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశామన్నారు. సమస్యను పరిశీలించిన పార్లమెంట్ సభ్యులు త్వరలో పాఠశాలను సందర్శించి, తగిన చర్యలు తీస్కుంటామని తెలిపినట్లు ఉపసర్పంచ్ నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సదానంద గౌడ్, సాబెర్ తదితరులున్నారు.



# అంబేద్కరా..! రాజ్యాంగ పరిరక్షణలో రేవంత్ సర్కార్‌కు మంచి బుద్ధిని ప్రసాదించు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, డిక్లరేషన్లు, గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం కుత్బుల్లాపూర్ డివిజన్ అంబేద్కర్ నగర్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. రాజ్యాంగ పరిరక్షణతో పాటు ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మంచి బుద్ధిని ప్రసాదించాలని అంబేద్కర్‌ను కోరారు. అంతకుముందు చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ నగర్ వరకు బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. హామీల అమలులో జాప్యం కారణంగా రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైతులకు పెట్టుబడి సాయం, రైతు భరోసా, కౌలు రైతులకు రైతు భరోసా, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా, పెండింగ్ ఫీజు బకాయిల చెల్లింపు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్ల పెంపు వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో తమ బాధ్యత అని, అయితే ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు పోలీసులను ఉపయోగించడం సరికాదని అన్నారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం రాజకీయ ఎదురుదాడులకు దిగుతోందని విమర్శించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులు కల్పించిందని, ఆ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు.



రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రజల సంక్షేమం కోసం పనిచేసేలా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అంబేద్కర్ మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట

## బీఆర్ఎస్వీ నేతకు గాయాలు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**
బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ గాయపడ్డారు. నిరసన కార్యక్రమం సందర్భంగా పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే సస్పెండ్ చేయాలి

## తెలంగాణ మహిళా కాంగ్రెస్ నిరసన




**హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 08, :**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత, అవమానకర వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజతో కలిసి ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తాతా మధు స్పీకర్ కి బహిరంగ క్షమాపణ చెప్పాలని, బీఆర్ఎస్ అధిష్ఠానం ఆయనపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని, దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని చెల్లించారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు మహిళ కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తాతా మధు తన పదవికి రాజీనామా చేయాలి

## కాంగ్రెస్ పార్టీ నేతల డిమాండ్



**కొమురంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**
డీసీసీ ఆదేశాల మేరకు రెబ్బెన మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ కి చెందిన ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అవమానకర, అసభ్యకర వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ బద్ధమైన అత్యున్నత పదవుల్లో ఒకటైన శాసనసభ స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజా ప్రతినిధిపైనా ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. దళిత వర్గానికి చెందిన వ్యక్తి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నారనే కారణంతో ఆయనను అవమానించేలా మాట్లాడటం జరిగి ఉంటే, అది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం మాత్రమే కాకుండా దళిత సమాజం ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యగా భావించాల్సి ఉంటుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే ప్రజలకు, శాసనసభకు, స్పీకర్ కి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతను గుర్తించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది. శాసనసభ స్పీకర్‌పై చేసినట్టి అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని,ఎమ్మెల్సీ తాతా మధు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడేందుకు సంబంధిత ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని పరిశీలించాలని, ఎమ్మెల్సీ పదవికి తాతా మధు రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా డిమాండ్ చేస్తోందన్నారు. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని కించపరిచే ఏ వ్యాఖ్యలనైనా ప్రజాస్వామ్య పద్ధతిలో తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈస్సీ, ఎస్టీ నాయకులు లింగంపల్లి ప్రభాకర్, దుర్గం రాజేష్, బొంగు నర్సింగరావు, అజ్మేరా గోపి, అజ్మీర ఈశ్వర్, గోగర్ల రాజేష్, గోగర్ల శ్రీనివాస్, శనిగరపు క్రాంతి కుమార్, జాడి కిషోర్, తైదల కృష్ణ, వడ్లురి వెంకటేష్ పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- **మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, కార్యదర్శి రాధాకృష్ణ శర్మ**



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**
వంద రోజుల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు దాటినా ప్రజలకు చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా సిద్దిపేటలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అరెస్టులు, నిరసనలకు దిగితే అడ్డంకులు అనే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతోందని ఆరోపించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం విరుద్ధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఓట్లు అడగడానికి వస్తే ప్రజలు తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ముఖ్యమంత్రి తన వైఖరిని మార్చుకుని ప్రజాస్వామ్య బద్ధంగా పాలన సాగించాలని, శాసనసభ సమావేశాలను సజావుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలను అవమానించినందుకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఉద్యమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, సీనియర్ నాయకులు గుండు భూపేష్, పాల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



# దూలపల్లి డివిజన్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- **పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: కూన శ్రీశైలం గౌడ్**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, దూలపల్లి, సెప్టెంబర్ 08, :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి సర్కిల్ దూలపల్లి డివిజన్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకుడు బైరి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని ఆరోపించారు. అప్పట్లో రేషన్ కార్డు లబ్ధిదారులకు దొడ్డు బియ్యం అందించడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తూ పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందన్నారు. నూతన రేషన్ కార్డుల మంజూరుతో గతంలో ఇబ్బందులు ఎదుర్కొన్న అర్హులైన కుటుంబాలకు ఉపశమనం కలుగుతోందని తెలిపారు. నిరుపేదలకు ఉచిత బియ్యం అందించడంతో పాటు వారి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వేల కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయిస్తున్నారని కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ముఖ్యమంత్రి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు బైరి భాస్కర్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రాజు, మాజీ ఎంపీటీసీలు మోహన్ రావు, అశోక్, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేష్, గోవర్ధన్ గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించలేని రేవంత్ సర్కార్ వెంటనే గద్దె దిగాలి

- **అసెంబ్లీని కౌరవ సభగా మార్చి దుశ్శాసన పర్వానికి తెరలేపారు.. రానున్న ఎన్నికల్లో మహిళలే బుద్ధి చెబుతారు**
- **కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తల ధర్నా**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**
మహిళా ప్రజాప్రతినిధుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులు వ్యవహరించిన తీరు అవమానకరంగా ఉందని ఆరోపిస్తూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు మంగళవారం చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు హాజరయ్యేందుకు సోమవారం వస్తున్న బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్న తీరును నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు మాట్లాడుతూ.. మహిళలకు గౌరవం ఇస్తున్నామని చెప్పే సీఎం రేవంత్ రెడ్డి, అసెంబ్లీ గేటు వద్ద మహిళా ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన వ్యవహారంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ముఖ్యమంత్రి కనీసం విచారణకు ఆదేశించకపోవడం మహిళలను కించపరచడమేనని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్ల అమలుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనే భయంతోనే వారిని సభకు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. అసెంబ్లీని కౌరవ సభగా మార్చి దుశ్శాసన పర్వానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందని వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించడం, జుట్టు, చీర లాగడం వంటి ఘటనలకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, నిరంకుశ ధోరణితో, కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించలేని రేవంత్ సర్కార్ వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో వైభవంగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**
- **ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి**
- **పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత.. మూడు షిఫ్టుల్లో సిబ్బంది నియామకం**
- **నిమజ్జనానికి ముందే అన్ని శాఖల అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించాలి**
- **పీస్ కమిటీ సమావేశంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష**




**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 08, :**
జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మంగళవారం గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం నేపథ్యంలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి పాల్గొని ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలోని మొత్తం ఐదు మున్సిపాలిటీల్లో చేపడుతున్న ఏర్పాట్లపై సంబంధిత అధికారులు, జిల్లా పంచాయతీ అధికారిని ప్లాన్ ఆఫ్ యాక్షన్ అడిగి తెలుసుకున్నారు.

### ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

ప్రతి సంవత్సరం జిల్లాలో పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకుంటున్నామని,అదే మంచి సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించాలని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా, నిమజ్జన పాయింట్ల వద్ద ఏర్పాట్లు తదితర అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

### పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక సంస్థలు పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నిమజ్జన పాయింట్ల వద్ద మూడు షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు

### మద్యం విక్రయాలపై కఠిన చర్యలు

నిమజ్జనం సందర్భంగా జిల్లాలో మద్యం విక్రయాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని, మద్య నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గణేష్ మండపాల సమీపంలో ఎక్కడైనా బెల్ట్ షాపులు ఉంటే మద్యం విక్రయాలను నియంత్రించాలని సూచించారు.

### రూట్ మ్యాప్ ముందుగానే సిద్ధం చేయాలి

గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన రూట్లలో అవసరమైన రోడ్డు మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని, నిమజ్జన పాయింట్లకు అప్రోచ్ రోడ్లు సక్రమంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

### ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ

జిల్లాలో సెప్టెంబర్ 23, 24 తేదీల్లో ప్రధానంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాలు జరుగనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు ముందుగానే జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించి ఉత్సవాలను శాంతియుతంగా విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లత, రాజ్ గౌడ్, అదనపు ఎస్పీ చేతన్ నితిన్, ఆర్డీవోలు, డిఎస్పిలు, జిల్లా అధికారులు, పుర ప్రముఖులు, పీస్ కమిటీ సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కూచిపూడికి శాశ్వత ప్రాణదాత వేదాంతం శర్మ

## నేడు వేదాంతం సత్యనారాయణ శర్మ జయంతి

కూచిపూడి నాట్యకళకు ప్రపంచ వేదికలపై విశిష్టమైన గుర్తింపును తెచ్చిన కళా మహనీయుడు వేదాంతం సత్యనారాయణ శర్మ. స్త్రీ పాత్రలను పోషించడంలో ఆయన కనబరచిన నైపుణ్యం, అభినయ శక్తి, హావభావాల లోని సున్నితత్వం కూచిపూడి నాట్య చరిత్రలో చిరస్మరణీయ ఘట్టం. స్త్రీ వేషధారణలో ఆయన చూపిన అద్భుత కౌశల్యం వల్లే కళా రసికులు ఆయనను "స్త్రీ పాత్రల నటనా సార్వభౌముడు"గా సత్కరించారు. 1935 సెప్టెంబర్ 9న కృష్ణా జిల్లాలోని కూచిపూడి గ్రామంలో జన్మించిన ఆయనకు కళారంగం వారసత్వంగా లభించింది. తండ్రి వేదాంతం వెంకట రామయ్య స్వయంగా కూచిపూడి కళాకారుడు. బాల్యం నుంచే నాట్యాసక్తి కలిగిన ఆయన, వేదాంతం రాఘవయ్య, వేదాంతం వెంకట చలపతి, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి వంటి గురువుల వద్ద శిక్షణ పొందారు. ఈ శిక్షణ లోనే ఆయనకు స్త్రీ పాత్రల నటనలోని మెళకువలు అవగాహన అయ్యాయి.

శర్మగారు సత్యభామ పాత్రలో చేసిన "భామాకలాపం" ప్రదర్శన అమర కీర్తిని తెచ్చింది. సత్యభామ అహంకారం, అలక, భక్తి, ప్రణయభావాలు ఆయన అభినయంతో జీవం పొందాయి. "ఉషా పరిణయం"లో చిత్రలేఖగా, "క్షీరసాగర మథనం"లో మోహినిగా ఆయన కనబరచిన నటనా వైభవం ప్రేక్షకులను విభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఆయన మోహిని పాత్ర ధారణలోని ఆకర్షణీయమైన లావణ్యం, సౌందర్య భావన, మృదువైన హావభావాలు ప్రేక్షకుల హృదయాలలో అచంచల ముద్ర వేశాయి. కేవలం నటనలోనే కాదు, దర్శకత్వంలోనూ ఆయన తన ప్రతిభను చాటారు. పునరావృతమవుతున్న నాట్య, నాటికలకు కొత్తదనాన్ని జోడించి, సంప్రదాయంలో ఆధునికతను కలిపారు. ఆయన చేసిన ప్రదర్శనలు దేశమంతటా మాత్రమే కాక, అమెరికా, యూరప్, రష్యా, జపాన్ వంటి అనేక దేశాలలోనూ కూచిపూడికి విశేష గౌరవాన్ని తెచ్చాయి. గురువుగా ఆయన పాత్ర మరింత విశిష్టం. ఆంధ్ర విశ్వవిద్యాలయం, పి.ఎస్. తెలుగు విశ్వవిద్యాలయం వంటి విద్యాసంస్థల్లో ఆయన బోధన చేసి, అనేకమంది శిష్యులను తీర్చిదిద్దారు. ఆయన శిష్యులు కూచిపూడి నాట్యానికి ప్రతిష్ఠ తీసుకొచ్చారు. గురుకుల పద్ధతిని పునరుద్ధరించి, శిష్యులకు శాస్త్ర బద్ధంగా, సంప్రదాయ పూర్వకంగా శిక్షణ అందించారు. కేవలం నృత్యకళ నేర్పడమే కాదు, కూచిపూడి తత్త్వం, దాని ఆధ్యాత్మిక పరమార్థాన్ని కూడా ఆయన శిష్యులలో నాటారు. శర్మ కళాకారుడిగానే కాక, పరిశోధకుడిగానూ కూచిపూడికి అపూర్వమైన సేవ అందించారు. "భామాకలాపం – ఒక సమగ్ర అధ్యయనం", "కూచిపూడి నృత్య చరిత్ర", "నాట్యశాస్త్రం – కూచిపూడి దృక్కోణం", "కూచిపూడి యక్ష గానాలు" వంటి గ్రంథాలను రచించి, నాట్య శాస్త్రానికి, కూచిపూడి సంప్రదాయానికి శాస్త్రీయ స్థిరత్వాన్ని కల్పించారు. ఆయన రచనల ద్వారా కూచిపూడి కళారూపం విశ్వ విద్యాలయ స్థాయిలో అధ్యయనార్థకమైన శాస్త్రీయమైన ఆధారాన్ని పొందింది. ఈ కారణంగానే కూచిపూడి కళ పాఠశాలలకే పరిమితం కాక, విశ్వ వ్యాప్తంగా పరిశోధనలకు, పాఠ్యాంశాలకు స్థానం సంపాదించింది. ఆయన కృషికి గుర్తింపుగా అనేక గౌరవాలు వరించాయి. 1961లో సంగీత నాటక అకాడమీ అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే కళాప్రపూర్ణ బిరుదు, 1998లో పద్మభూషణ్, 2011లో పద్మశ్రీ వంటి విశిష్ట పురస్కారాలు ఆయన కళా మహిమాన్వితతకు నిదర్శనం. అదేవిధంగా, మధ్యప్రదేశ్ ప్రభుత్వం 1988లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కాళిదాస్ సమ్మాన్ అవార్డుతో సత్కరించింది. 2005లో తెలుగు విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం "హంస అవార్డు"ను అందచేసింది. సిద్ధేంద్రయోగి నర్తన అవార్డును అందుకున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం "భరతముని అవార్డు"తో సత్కరించింది. ఈ గౌరవాలు ఆయన ప్రతిభకు కేవలం బిరుదులు మాత్రమే కాక, కళామహిమాన్వితతకు ఇచ్చిన సాక్ష్యాలు. కూచిపూడి నాట్య ప్రదర్శనల ద్వారా వేదాంతం సత్యనారాయణ శర్మ మన తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ నుండి ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్రపతులు వి.వి.గిరి, నీలం సంజీవరెడ్డి, డా. శంకర్ దయాళ్ శర్మ, డా. జకీర్ హుస్సేన్, డా. ఆర్.కె. నారాయణన్‌ల వంటి మహానుభావుల చేత ప్రశంసలు పొందారు. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ప్రధాన మంత్రులుగా ఇంద్రాగాంధీ, పి.వి. నరసింహారావు వంటి నేతలు ఆయన ప్రదర్శనలను ప్రత్యక్షంగా తిలకించి ప్రశంసించారు. ఈ గుర్తింపులు కేవలం కళాకారుడికి మాత్రమే కాక, కూచిపూడి సంప్రదాయానికే మరింత గౌరవం తీసుకొచ్చాయి.

2012 నవంబరు 15న ఆయన పరమపదించినా, ఆయన వారసత్వం నేటికీ కూచిపూడి ప్రతి ప్రదర్శనలో జీవిస్తూనే ఉంది. ఆయన బోధనలు, రచనలు, ప్రదర్శనలు, శిష్యులు కలసి కూచిపూడిని శాశ్వత సజీవ కళారూపంగా నిలబెట్టాయి. వేదాంతం సత్యనారాయణ శర్మ కేవలం కళాకారుడు మాత్రమే కాదు, కూచిపూడికి నూతన శక్తి ప్రసాదించిన మహనీయ సంస్కృతి శిల్పి. అందుకే ఆయనను సంస్కృతిక లోకం "కూచిపూడికి జీవం పోసిన పురుషోత్తముడు"గా కీర్తించింది. వేదాంతం సత్యనారాయణ శర్మ జీవన కృషి ఒక కళాకారుని వ్యక్తిగత ప్రతిభకు మించినది; అది సంపూర్ణంగా కూచిపూడి నాట్య సంప్రదాయాన్నే ప్రపంచానికి పరిచయం చేసిన ఒక మహోన్నత సంస్కృతి యజ్ఞం. ఆయన వారసత్వం శాశ్వతం, ఆయన కీర్తి అమరత్వం.


రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# బడి పలుకుల భాష కాదు.. బతుకు పలుకుబడుల భాష!

### తెలంగాణ భాష: సహజత్వానికి సజీవ సాక్ష్యం

### నేడు తెలంగాణ భాషా దినోత్సవం

**భాష అనేది కేవలం మానవ భావ వ్యక్తీకరణకు ఉపకరించే శబ్ద సముదాయం మాత్రమే కాదు; అది ఒక సమగ్ర జాతి సాంస్కృతిక జీవన విధానానికి సజీవ సాక్ష్యం, శతాబ్దాల చారిత్రక పరిణామాల దర్పణం. మనిషి పుట్టిన నేల స్వభావం, పీల్చిన గాలిలోని అనురాగం, సాగుచేసిన మట్టిలోని పరిమళం, శ్రమజీవుల స్వేదబిందువుల తడి, పోరాటాల సెగలు అన్నీ ఏకమై భాషకు ఒక నిర్దిష్టమైన జీవద్భావరూపాన్ని, తిరుగులేని ఆత్మగౌరవాన్ని ప్రసాదిస్తాయి. అందుకే తెలంగాణ భాష అనగానే కేవలం కొన్ని విలక్షణమైన యాస పదాలు, వ్యావహారిక శబ్దాల సమాహారంగా భావించడం చారిత్రక దృష్టిలో అసంపూర్ణమైన అవగాహన మాత్రమే అవుతుంది.**



తెలంగాణ పలుకుబడి శతాబ్దాల సామాజిక మథనం, శ్రమ సౌందర్యం, అన్యాయంపై ఎక్కుపెట్టిన ధిక్కార స్వరం, హాస్య చమత్కారాలు, అంతకుమించిన అమాయక ఆత్మీయతల పవిత్ర సంగమం. అలాంటి సజీవ ప్రజాభాషను గౌరవిస్తూ, తెలంగాణ ప్రజల గొంతుకకు అక్షరాలా రూపమిచ్చిన అక్షరయోధుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 9వ తేదీన 'తెలంగాణ భాషా దినోత్సవం'గా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించుకోవడం చారిత్రక ఔచిత్యం. 2014లో స్వయంపాలన సిద్ధించిన అనంతరం తెలంగాణ ప్రభుత్వం కాళోజీ జయంతిని అధికారికంగా తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించగా, 2018లో దీనిని రాష్ట్రస్థాయి అధికారిక వేడుకగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా తెలంగాణ మట్టి భాషకు రాజముద్రతో కూడిన సముచిత గౌరవం దక్కింది.

1914 సెప్టెంబర్ 9న కర్ణాటకలోని రట్టహళ్లిలో రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాజు కాళోజీ జన్మించినప్పటికీ, ఆయన బాల్యం, విద్యాభ్యాసం, చేతన, చింతన అంతా తెలంగాణ గడ్డపైనే ప్రాణం పోసుకున్నాయి. మడికొండ, వరంగల్, హైదరాబాద్ నగరాలలో సాగిన విద్యార్థి జీవితంలోనే ఆయన ప్రజాచైతన్యాన్ని పుణికి పుచ్చుకున్నారు. న్యాయవిద్యను అభ్యసించి నల్లకోటు ధరించినప్పటికీ, న్యాయస్థానపు నాలుగు గోడల మధ్య సంపన్నుల వివాదాలను పరిష్కరించడం కన్నా, నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న పీడిత ప్రజల పక్షాన నిలబడి అన్యాయాలను నిలదీయడానికే కాళోజీ జీవితాంతం అంకితమయ్యారు. ఆంధ్ర మహాసభ ఉద్యమం, గ్రంథాలయోద్యమం, రజాకార్ల దురాగతాలకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం, భారత స్వాతంత్ర్యోద్యమం, ఆ తరువాతి ప్రత్యేక తెలంగాణ ప్రజా ఆకాంక్షల ఉద్యమాలలో కాళోజీ కలం నిరంతరం ప్రజల పక్షాన గర్జించింది. 'నా గొడవ' పేరుతో ఆయన రాసిన విస్తృత కవితా సంపుటాలు కేవలం కవిత్వ గ్రంథాలు కావు; అవి ఆనాటి సమకాలీన సామాజిక, రాజకీయ, ఆర్థిక రుగ్మతలపై ఎక్కుపెట్టిన అక్షర తూటాలు. సంస్కృత భూయిష్టమైన కృత్రిమ పాండిత్య భాషను, ఛందోబద్ధ సంకెళ్లను తెంచుకుని, పల్లెటూరి మట్టిమనిషి నిత్యం మాట్లాడే పచ్చి పల్లె పలుకుబడినే సాహిత్య వేదికపై సగర్వంగా నిలబెట్టిన ఘనత కాళోజీకే దక్కుతుంది. 'భాష రెండు విధాలు– ఒకటి బడి పలుకుల భాష, మరొకటి పలుకుబడుల భాష; బడి పలుకుల భాష కన్నా పలుకుబడుల భాషే గొప్పది' అని కుండబద్దలు కొట్టిన కాళోజీ, సామాన్యుడి కన్నీటిని, చెమటను, నిరసనను, కోపాన్ని తన కవిత్వంలో కేంద్రబిందువుగా ప్రతిష్టించారు. 'పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది' అని నినదించి, యావజ్జీవితాన్ని ప్రజా సమస్యలకే ధారపోసి, మరణానంతరం కూడా తన పార్థివ దేహాన్ని వైద్య పరిశోధనల కోసం కాకతీయ వైద్య కళాశాలకు దానమిచ్చి మాటను చేతల్లో చూపిన అపురూప మానవతావాది కాళోజీ.

తెలంగాణ భాషా ప్రాచీనతను, గొప్పతనాన్ని అవగతం చేసుకోవాలంటే వేల ఏండ్ల సాహితీ చరిత్రను పునఃసమీక్షించుకోవాలి. క్రీస్తుపూర్వం శాతవాహనుల కాలం నాటి 'గాథాసప్తశతి' ప్రాకృత గ్రంథంలోనే అత్త, వదిన, పిల్ల, వోడ వంటి దేశి పదాలు విరివిగా కనిపించడం తెలంగాణ నేల భాషా ప్రాచీనతకు తిరుగులేని చారిత్రక నిదర్శనం. ప్రథమ తెలుగు పద్య శాసనంగా ప్రసిద్ధి చెందిన క్రీస్తుశకం 946 నాటి ధర్మపురి క్షేత్రం అగ్రహార దానం గురించి తెలిపే

కురిక్యాల శాసనాన్ని నిర్మించిన పంప మహాకవి సోదరుడు జినవల్లభుడు తెలంగాణ నేలపైనే కంద




పద్యాలకు ప్రాణం పోశాడు. పాల్కురికి సోమనాథుడు 12వ శతాబ్దంలోనే గంభీర సంస్కృత పదాల సంకెళ్లను తెంచి 'జానుతెనుగు'లో దేశి ద్విపద కావ్యాలు రచించి 'ఒగి నెల్ల యెడల దేశీయ పదముల జానుదెనుగున' అంటూ సామాన్యుల భాషకు కావ్యగౌరవాన్ని కల్పించాడు. మల్లికార్జున పండితారాధ్యుడు, కాకతీయుల కాలం నాటి శివకవులు, బమ్మెర పోతన, గోల్కొండ కవుల వరకు ఈ నేల సహజ దేశీయ పదసంపదతో పరవళ్లు తొక్కింది. ఆ తదనంతర చారిత్రక పరిణామాలలో బహమనీలు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల సుదీర్ఘ పాలన ప్రభావంతో తెలుగు భాష పరిధి విస్తృతమై ఉర్దూ, దఖనీ, మరాఠీ, కన్నడ, పారశీక భాషల పదాలు సహజంగా తెలుగులో కలగలిసి పోయాయి. తెలంగాణ ప్రజలు ఆ పదాలను యథాతథంగా స్వీకరించక, తమ నాలుకలకు అనువైన రీతిలో, తమ వ్యాకరణానికి ఒదిగేలా 'స్వదేశీకరించుకుని' సొంతం చేసుకున్నారు. ఆ విధంగా రూపుదిద్దుకున్న భాషా సంపద ఎన్నటికీ కలుషితం కాదు; విభిన్న సంస్కృతుల కలయికతో ఏర్పడిన అద్భుతమైన చారిత్రక సమన్వయ సంపద.

'అయ్యా', 'బాబూ', 'ఎట్లున్నావ్', 'ఏమాయె', 'బిడ్డా', 'నయంగున్నదా', 'పోతన్నావా', 'వస్తన్నావా' వంటి వాత్సల్యభరిత పలుకుబడులు, 'అవ్వ', 'తాత', 'బావ', 'అన్న', 'అక్క' వంటి సంబోధనల్లోని అనురాగం తెలంగాణ సంభాషణలకు ప్రత్యేకమైన మాధుర్యాన్నిస్తాయి. మాటలో మమకారం, పలుకులో పరిమళం, పిలుపులో ప్రాణం నింపడం తెలంగాణ భాష సహజ లక్షణం. శ్రామిక జీవులు పాడుకునే జాజర పాటలు, వరికోత పాటలు, బతుకమ్మ ఉత్సవాలలో స్త్రీల గొంతుల్లో పలికే ఆత్మీయ నివేదనలు, ఒగ్గుకథలు, బాలల కథలు, బుర్రకథలు, చిందు భాగవతాలు, కొమురవెల్లి మల్లన్న పట్నాలు, గిరిజనుల గోండు, కోయ మౌఖిక గాథలు ఈ భాషా సౌందర్యానికి ప్రత్యక్ష సాక్ష్యాలు. ప్రతి పల్లె పదంలోనూ ఒక శాస్త్రీయత, జీవన అనుభవం, ప్రకృతితో మమేకమైన విజ్ఞానం దాగి ఉన్నాయి. దురదృష్టవశాత్తూ ఉమ్మడి పాలన కాలంలో ఈ సజీవ భాషను సరైన అవగాహన లేకుండా 'యాస' అని, వ్యాకరణ విరుద్ధమని, సంస్కారహీనమని హేళన చేసిన చారిత్రక దుస్థితి నెలకొంది. ఏ భాషాశాస్త్రమైనా నిరూపించే ప్రాథమిక సత్యం ఏమిటంటే–భూగోళంపై ఏ భాషకైనా నికరమైన ప్రామాణికత అనేది కేవలం ఒక ప్రాంతానికో, వర్గానికో పరిమితం కాదు; ప్రతి ప్రాంతీయ మాండలికానికి దానిదైన శబ్ద పరిణామ సూత్రాలు, ధ్వని సౌందర్యం, వాక్య నిర్మాణం, నుడికారపు గాఢత ఉంటాయి. ప్రామాణిక గ్రంథస్థ భాష పరిపాలనకు, నిఘంటువులకు ప్రతీకైతే, మట్టిభాష ప్రజల నిత్య చైతన్యానికి శ్వాస వంటిది. రెండూ ఒకే తెలుగు భాషా వృక్షానికి ఉన్న రెండు బలమైన కొమ్మలు తప్ప పరస్పర విరుద్ధాలు కావు. ఒకదాని వైభవాన్ని చాటడానికి మరొకదానిని కించపరచాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు.

జాతీయ స్థాయిలో భాషా గణాంకాలను నిశితంగా పరిశీలిస్తే భారత జనగణన వివరాల ప్రకారం తెలుగు దేశంలోనే అత్యధికులు మాట్లాడే ప్రాచీన, అగ్రగామి ద్రావిడ భాషలలో ఒకటిగా భాసిల్లుతోంది. దేశవ్యాప్తంగా 8 కోట్లకు పైగా ప్రజలకు తెలుగు మాతృభాషగా ఉండగా, తెలుగు మాట్లాడే సమాజాలు కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే పరిమితం కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి పొరుగు రాష్ట్రాల్లోను, ఖండాంతర దేశాల్లోను విస్తరించి ఉన్నాయి.

జనగణన నివేదికలు స్పష్టం చేస్తున్నట్లుగా బహుభాషా సంస్కృతి ప్రజలను వేరుచేసే గోడ కాదు, విభిన్న జనసమూహాలను అనుసంధానించే సాంస్కృతిక వారధి. తెలంగాణ సమాజం శతాబ్దాలుగా బహుభాషలను తనలో ఇముడ్చుకుంటూనే తన ప్రత్యేక అస్తిత్వాన్ని, సహజత్వాన్ని కాపాడుకుంటూ వస్తోంది. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే సెప్టెంబర్ 9న భాషా దినోత్సవం జరుపుకోవడం అంటే కేవలం కాళోజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించడమో, సాంస్కృతిక సభల్లో ప్రసంగాలు దంచడమో లేదా కవి సమ్మేళనాలు నిర్వహించడమో మాత్రమే కాకూడదు. ఒక భాష దీర్ఘకాలం వర్ధిల్లాలంటే అది పరిపాలనా దస్త్రాలలో మాత్రమే కాక, ప్రజల నిత్య వ్యవహారంలో జీవించాలి; పసిపిల్లల ఆటపాటల్లో ప్రతిధ్వనించాలి; ఇంటి ముంగిళ్లలో ఆత్మీయంగా వినిపించాలి; పాఠశాల తరగతి గదుల్లో సంకోచం లేకుండా గౌరవించ బడాలి; సాహిత్య సృజనలో విస్తరించాలి; సినిమా, నాటక, డిజిటల్ మాధ్యమాలలో సహజ నైజంతో ఆవిష్కృతమవ్వాలి.

ఈ క్రమంలో మన విద్యా వ్యవస్థకు, ఉపాధ్యాయ లోకానికి అత్యంత గురుతరమైన బాధ్యత ఉంది. పాఠశాలలకు వచ్చే గ్రామీణ, బడుగు వర్గాల పిల్లలు తమ సహజమైన తెలంగాణ మాండలికంలో మాట్లాడినప్పుడు 'ఇది అశుద్ధమైన యాస, ఇలా మాట్లాడకూడదు' అని దండించడం లేదా హేళన చేయడం వారిలోని ఆత్మస్థైర్యాన్ని, సృజనాత్మకతను నిర్దాక్షిణ్యంగా దెబ్బతీస్తుంది. ప్రామాణిక తెలుగులోని రచనా నియమాలను విద్యార్థులకు నేర్పిస్తూనే, వారి ఇంటి భాషను, ప్రాంతీయ నుడికారాన్ని ఆత్మీయంగా గౌరవించే సున్నితమైన బోధనా పద్ధతులు విస్తృతంగా అమలులోకి రావాలి. మాతృభాషపై పరిపూర్ణమైన ప్రేమ, పట్టు ఉన్నప్పుడే ఇతర ప్రపంచ భాషలను సులువుగా నేర్చుకోగల బహుభాషా విజ్ఞానం పెంపొందుతుంది. ఆధునిక ప్రపంచీకరణ, విపరీత పట్టణీకరణ, ఆంగ్ల మాధ్యమ వ్యామోహం, డిజిటల్ సంక్షిప్త సందేశాల యుగంలో అన్ని ప్రాంతీయ మాతృభాషలు పెను సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణమిది. ఉపాధి కోసం ఆంగ్లం, జాతీయ స్థాయి అవసరాల కోసం హిందీ లేదా ఇతర భాషలు నేర్చుకోవడం తప్పనిసరి అయినప్పటికీ, వాటి కోసం స్వంత భాషను విస్మరించడం ఆత్మహత్యా సదృశం. లోకాన్ని జయించడానికి ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు గానీ, మన మూలాలను, మన సాంస్కృతిక అస్తిత్వాన్ని గుర్తించడానికి, అంతరంగాన్ని నిష్కల్మషంగా వ్యక్తీకరించడానికి మాతృభాష ఒక్కటే అసలైన సాధనం.

తెలంగాణ నేల భాషను భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడానికి సమష్టి కార్యాచరణ అత్యవసరం. పల్లెల్లో అంతరించిపోతున్న వ్యవసాయ, చేతివృత్తుల, జీవన అనుబంధ అపురూప పదజాలాన్ని పండితులు, పరిశోధకులు క్షేత్రస్థాయికి వెళ్లి శాస్త్రీయంగా నమోదు చేయాలి. వృద్ధుల నోటి నుంచి జాలువారే సామెతలు, పొడుపు కథలు, వైద్య విధానాలు, జానపద కథాగేయాలను ఆధునిక డిజిటల్ శ్రవ్య–దృశ్య రూపాల్లో భాండాగారాలుగా భద్రపరచాలి. తెలంగాణలోని అన్ని జిల్లాల మాండలిక పదకోశాలను, వృత్తి పదకోశాలను విశ్వవిద్యాలయాలు ప్రతిష్టాత్మకంగా రూపొందించాలి. నేటి ఆధునిక సాంకేతిక విప్లవంలో భాగంగా కృత్రిమ మేధస్సు (ఏఐ), సహజ భాషా విశ్లేషణ (ఎన్ఎల్‌పీ), వాయిస్ రికగ్నిషన్, స్వయం అనువాద సాఫ్ట్‌వేర్లలో తెలంగాణ విలక్షణ పదసంపదకు, ఉచ్ఛారణా శైలికి తగిన స్థానం కల్పించేలా సాంకేతిక పరిశోధనలు ముమ్మరం కావాలి. నవతరం రచయితలు, కళాకారులు తెలంగాణ జీవితాన్ని కృత్రిమత్వం లేకుండా తెలంగాణ పలుకుబడితోనే నవ్య సాహిత్యంగా ఆవిష్కరించాలి. పత్రికలు, దృశ్యమాధ్యమాలు ఈ భాషను కేవలం హాస్యానికి మాత్రమే పరిమితం చేయకుండా గంభీర విశ్లేషణలకు, సంపాదకీయాలకు సైతం సమర్థవంతంగా వినియోగించాలి.

భాషను బతికించేది కేవలం ప్రభుత్వ ఉత్తర్వులో, తాత్కాలిక సభాప్రాంగణాలో కావు; సమాజం తన భాష పట్ల ప్రదర్శించే నిరంతర స్వాభిమానం, ఆచరణాత్మక వినియోగం మాత్రమే దానిని సజీవంగా ఉంచుతాయి. ఒక మనిషి తన తల్లి ప్రేమామృతాన్ని ఎలా మరచిపోలేడో, ఒక సమాజం తన పురిటిగడ్డ భాషను అలా విస్మరించకూడదు. భాషను కాపాడుకోవడం అంటే ప్రాచీన అక్షరాలను భద్రపరచడం మాత్రమే కాదు; ఆ పదాల మాటున తరతరాలుగా నిక్షిప్తమై ఉన్న ఆచార వ్యవహారాలను, పోరాట వీరత్వాన్ని, త్యాగాలను, కన్నీటి గాథలను, జీవన మూలాలను కాపాడుకోవడమే. 'మాట మనది, మట్టి మనది, మనుగడ మనది' అనే ప్రగాఢ ఆత్మవిశ్వాసంతో తెలంగాణ పలుకుబడిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ, ప్రపంచ భాషా వేదికలపై సగర్వంగా నిలబెట్టడమే కాళోజీ నారాయణరావుకు మనం అర్పించే నిజమైన నివాళి, తెలంగాణ భాషా దినోత్సవానికి నిండైన సార్థకత.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



## భారత్ ను చూసి నేర్చుకోండి

**ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ సూచన**

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న జట్టు నుంచి ఏడుమంది ప్లేయర్లు, ఇద్దరు కోచ్‌లను ఆకస్మికంగా స్వదేశానికి రప్పించాలన్న బోర్డు నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలోనే ఆయన సెలెక్టర్ పదవికి సైతం రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సెలెక్షన్ కమిటీ సభ్యులందరికీ పీసీబీ షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై మిస్బా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతికూల పరిస్థితులలో కూడా హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించడం సరికాదని అన్నారు. ఓటమి ఎదురైన ప్రతిసారీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దకుండా తాత్కాలిక మార్పులకే బోర్డు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. విదేశాల నుంచి వచ్చే కోచ్‌లకు బోర్డు అపరిమితమైన అధికారాలను ఇస్తోందని, ఒకవేళ జట్టు విఫలమైనా వారిపై ఎలాంటి బాధ్యతను మోపట్లేదని మండిపడ్డారు. అదే సమయంలో సొంత కోచ్‌లకు మాత్రం కనీస మద్దతు ఇవ్వట్లేదని, ప్రతి చిన్న దానికి వారిని బోనులో నిలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను విదేశీ కోచ్‌ల నియామకాన్ని తప్పుబట్టట్లేదని, విదేశీ కోచ్‌ల పట్ల కొంత సాఫ్ట్ కార్నర్ ఉంటోందని వ్యాఖ్యానించారు. అదే స్థానిక కోచ్‌ల విషయానికి వస్తే ప్రతి ఒక్కరూ వారిని విమర్శించడమే పనిగా పెట్టుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా భారత క్రికెట్ బోర్డు అనుసరిస్తోన్న విధానాలను మిస్బా ఉదహరించారు. భారత జట్టు ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానంలో కొనసాగడం వెనుక దశాబ్దాల కఠోర శ్రమ ఉందని అన్నారు. 1990ల నుంచి భారత్ తమ క్రికెట్ నిర్మాణంపై దృష్టి పెడుతూ వచ్చిందని, దాని ఫలితాల వల్లే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి గొప్ప ఆటగాళ్లు పుట్టుకొచ్చారని గుర్తుచేశారు. పాకిస్తాన్ క్రికెట్‌లో ప్రస్తుతం యువ ఆటగాళ్లకు టెస్ట్ క్రికెట్ ఆడే అవకాశం చాలా తక్కువగా లభిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నేటి తరం ఆటగాళ్లు ఎక్కువగా పరిమిత ఓవర్ల క్రికెట్‌కే ప్రాధాన్యత ఇస్తోన్నారని, దీనివల్ల టెస్ట్ ఫార్మట్ లో రాణించే నైపుణ్యాలు కొరవడుతున్నాయని విశ్లేషించారు. ఒత్తిడిని తట్టుకోలేకపోవడానికి ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడకపోవడమే కారణమని చెప్పారు. పాకిస్తాన్ క్రికెట్ పూర్వవైభవాన్ని సంతరించుకోవాలంటే పీసీబీ తన విధానాలను మార్చుకోవాల్సి ఉంటుందని మిస్బా సూచించారు. ఆకస్మిక మార్పులతో ఆటగాళ్లలో భయాందోళనలు పెరుగుతాయే ఒరిగేదేమీ ఉండదని, యువ ఆటగాళ్లకు ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడేలా ప్రోత్సహించాలని చెప్పారు.

# ఇండియాతో చారిత్రాత్మక పోరుకు జపాన్ జట్టు ప్రకటన





ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్, ఐసీసీ నంబర్ వన్ ర్యాంకర్ అయిన టీమ్ ఇండియాతో సెప్టెంబర్ 22న టోచిగిలోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే చారిత్రాత్మక టీ20 సమరానికి జపాన్ క్రికెట్ బోర్డు.. తమ జట్టును అధికారికంగా అనౌన్స్ చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నివేదిక ప్రకారం, ఈ మ్యాచ్ ముగిసిన రెండు రోజులకే నగోయాలో ఆరంభమయ్యే స్వదేశీ ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన స్క్వాడ్‌నే ఈ మ్యాచ్ బరిలోకి దించుతున్నారు. జపాన్ తరఫున అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడు కెండల్ కడోవాకి-ఫ్లెమింగ్ ఈ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. అతడితో పాటు 50కి పైగా టీ20 మ్యాచ్‌లు ఆడిన అనుభవజ్ఞులైన ఇబ్రహీం తకాహాషి, డెక్లాన్ సుజుకి-మెక్‌కాంబ్ జట్టులో కీలకం కానున్నారు. ఆసియా క్రీడల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని ఈ జట్టును సెలెక్ట్ చేయడంతో, ఐసీసీ అర్హత ఉన్నప్పటికీ గేమ్స్ నిబంధనల పరిధిలోకి రాని కొంతమంది ఆటగాళ్లను తప్పించాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఈ పరిణామం దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన యువ స్పిన్ ఆల్‌రౌండర్ జేక్ కుసుడ-నైర్న్‌కు మార్గం సుగమం చేసింది. 2013లో మొదటిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ ఆటగాడు సుయోషి తకాడా మళ్లీ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. స్కూల్ క్రికెట్ బుకాట్సు ప్రోగ్రామ్‌ల ద్వారా వెలుగులోకి వచ్చిన వతారు మియాచి, మకోటో తానియామాలు ఈ లైనప్‌లో చోటు దక్కించుకున్నారు. ఆస్ట్రేలియా దిగ్గజం షేన్ వార్న్ బౌలింగ్ వీడియోలు చూస్తూ లెగ్ స్పిన్ నేర్చుకున్న తానియామా, తన ఆరాధ్య క్రికెటర్ జెర్సీ నంబర్ 23 ధరించి ఆడనున్నారు. ఈ అరుదైన మ్యాచ్ భారత్, జపాన్ దేశాల ద్వైపాక్షిక సంబంధాల 75 సంవత్సరాల వేడుకల్లో భాగంగా 'స్పోర్ట్ 75' పేరుతో నిర్వహిస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఇరు దేశాల ప్రజల మధ్య క్రీడా సంబంధాలను విస్తరించడానికి ఈ వేదిక ఉపయోగపడనుంది. భారత్‌తో పోరుకు ముందు జపాన్ సెప్టెంబర్ 19, 20 తేదీల్లో హాంకాంగ్‌తో రెండు టీ20లలో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లో భాగంగా సెప్టెంబర్ 24న అఫ్గానిస్తాన్, 26న నేపాల్‌తో తలపడనుంది. మరోవైపు టీమ్ ఇండియా ఈ చారిత్రక పోరు కోసం శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివం దూబే, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీలతో కూడిన దుర్భేధ్యమైన జట్టును ప్రకటించింది.

# రూమర్లకు చెక్ పెట్టిన రాహుల్..





ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 మినీ వేలానికి ముందు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ భవితవ్యంపై నెలకొన్న ఎండ్ కార్డు పడింది. గత 2026 సీజన్ ముగిసిన నాటి నుంచి ఫ్రాంచైజీల మధ్య ఆటగాళ్ల ట్రేడింగ్ గురించి పలు రకాల ప్రచారాలు జరిగాయి. ఇప్పటికే రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ గూటికి చేరగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వెళ్లే భారీ ట్రేడ్ అధికారికంగా స్పష్టమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాహుల్ కూడా వేరే ఫ్రాంచైజీలోకి వెళ్తాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే రాబోయే సీజన్‌లో తాను ఢిల్లీ క్యాపిటల్స్ తరఫునే బరిలోకి దిగుతానని రాహుల్ స్వయంగా తేల్చిచెప్పాడు. ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ సోషల్ మీడియా వేదికగా రాహుల్‌ను ప్రశంసిస్తూ పెట్టిన పోస్ట్‌తో ఈ చర్చలకు తెరపడింది. రాహుల్‌ను అత్యుత్తమ క్లచ్ ప్లేయర్‌గా అభివర్ణించిన జిందాల్, ఫ్రాంచైజీతో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని రాసుకొచ్చాడు. "కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు నిజమైన ఆస్తి. జట్టు ప్రయోజనాలను ఎల్లప్పుడూ ముందుంచే వ్యక్తి. రాబోయే సీజన్‌లో ఢిల్లీని గర్వపడేలా చేయడానికి కలిసి శ్రమిస్తాం" అని జిందాల్ పేర్కొన్నాడు. దీనికి రాహుల్ స్పందిస్తూ "థ్యాంక్స్, వచ్చే సీజన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని బదులిచ్చాడు. దీంతో అతడు ఢిల్లీ క్యాపిటల్స్ జెర్సీలోనే కొనసాగుతాడన్న విషయం అధికారికంగా రూఢీ అయింది. 2025 సీజన్‌లో రూ. 14 కోట్లకు ఢిల్లీలో చేరిన రాహుల్, తొలి ఏడాది 539 రన్స్, 2026 సీజన్‌లో 593 రన్స్ చేసి అద్భుత ఫామ్ కనబరిచాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ వ్యవహారంలో కీలక మలుపు తిరిగింది. సరైన డీల్ కుదరకపోవడంతో హార్దిక్ మరో ఏడాది పాటు ముంబై ఇండియన్స్ జట్టులోనే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 2027 సీజన్ కోసం జట్టు నాయకత్వంలో మార్పులు జరగనున్నాయని, కొత్త కెప్టెన్ ఎంపిక ప్రక్రియలో మాజీ సారథి రోహిత్ శర్మ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాడని తెలుస్తోంది. కెప్టెన్సీ కోల్పోయినప్పటికీ హార్దిక్ జట్టులో ఒక ఆటగాడిగా కొనసాగే అవకాశాలను ఫ్రాంచైజీ పరిశీలిస్తోంది. ఫ్రాంచైజీలు తమ కోర్ గ్రూప్‌ను పటిష్టం చేసుకునే క్రమంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. రిషభ్ పంత్ రీఎంట్రీ, రాహుల్ కొనసాగింపుతో ఢిల్లీ క్యాపిటల్స్ మరింత బలంగా మారగా, మిగిలిన జట్లు సైతం సమతుల్యత కోసం ట్రేడింగ్ మార్గాలను అన్వేషిస్తున్నాయి.



## పట్టుబిగించిన ఈస్ట్ జోన్..

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటి కొండంత స్కోర్ చేసిన ఈస్ట్ జోన్.. ఆ తర్వాత బౌలింగ్‌తో సౌత్ జోన్ పని పట్టింది. దాంతో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈస్ట్ జోన్ బౌలర్లు మహమ్మద్ షమీ(2/17), ముఖేష్ కుమార్(2/36) నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులే చేసింది. క్రీజులో తిలక్ వర్మ(133 బంతుల్లో 5 ఫోర్లతో 56 బ్యాటింగ్), సీవీ మిలింద్(2 బ్యాటింగ్) ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ కుమార్‌తో పాటు ఖరైషి, శిఖర్ మోహన్ తలో వికెట్ తీసారు. సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల వెనుకంజలో ఉంది. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 708 పరుగుల భారీ స్కోర్‌ను అధిగమించేందుకు మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై సౌత్ జోన్ బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. ఓపెనర్ రికీ భుయ్(1) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. నారయణ్ జగదీషన్, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడారు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నారయణ్ జగదీషన్(32)ను శిఖర్ మోహన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరోవైపు షేక్ రషీద్‌తో కలిసి పడిక్కల్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో సౌత్ జోన్ 115/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే షేక్ రషీద్(27)ను మహమ్మద్ షమీ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా.. సెంచరీ దిశగా సాగిన పడిక్కల్‌ను ముఖేష్ కుమార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 3 పరుగుల వ్యవధిలోనే సౌత్ జోన్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, రవిచంద్రన్ స్మరణ్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని షమీ విడదీసాడు. రవిచంద్రన్(23) కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం శ్రేయస్ గోపాల్ క్రీజులోకి రాగా.. తిలక్ వర్మ ఆచితూచి ఆడటంతో సౌత్ జోన్ 176/5 టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో సమయోచితంగా బ్యాటింగ్ చేసిన ఈ జోడీ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో తిలక్ వర్మ 123 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన శ్రేయస్ గోపాల్‌ను ఖురైషి ఔట్ చేసి ఆరో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. చామ మిలింద్‌తో కలిసి తిలక్ వర్మ ఒంటరి పోరాటం చేశాడు. అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. మరో వికెట్ పోకుండా మూడో రోజు ఆటను ముగించాడు.



# నగ్నంగా నిలబెట్టేవారు..

సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్, నటి సందీపా విర్క్ తన జీవితంలో ఎదుర్కొన్న అత్యంత భయానకమైన దినాలను గుర్తుచేసుకుని తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రూ.6 కోట్ల మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి సందీపా విర్క్ దాదాపు నాలుగున్నర నెలల పాటు ఢిల్లీలోని తీహార్ జైలులో గడపాల్సి వచ్చింది. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న సందీపా విర్క్.. జైలులో తాను అనుభవించిన దారుణ పరిస్థితులను, అవమానాలను బయటపెట్టారు. జైలులో ఖైదీలను తనిఖీ చేసే పద్ధతి అత్యంత అమానుషంగా ఉంటుందని సందీపా చెప్పుకొచ్చారు. లోపలికి వెళ్లగానే సిబ్బంది బట్టలు విప్పించి ప్రైవేట్ పార్టులపై టార్చ్ లైట్ వేసి తనిఖీ చేస్తారని.. చలికాలంలోనూ ఇష్టారీతిన దుస్తులు తొలగించి అవమానిస్తారని వాపోయారు. ఇంత కఠినంగా శరీరాన్ని తనిఖీ చేస్తున్నప్పుడు జైలు లోపలికి మొబైల్ ఫోన్లు, డ్రగ్స్ ఎలా వస్తున్నాయని ఆమె ప్రశ్నించారు. జైలులో డబ్బు ఉంటే ఏదైనా సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక రోజులోనే రెండు మూడు సార్లు దుస్తులు ఊడదీసి తనిఖీలు చేసేవారని.. ఆ వందలాది తనిఖీల సమయంలో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని సందీపా విర్క్ వెల్లడించారు. “మహిళా సిబ్బందే కదా చూస్తోంది, దుస్తులు తీస్తే తప్పేంటి?” అని కొందరు తేలికగా మాట్లాడుతున్నారని సందీపా విర్క్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా జైలులోని ఆహారం, టాయిలెట్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండేవని.. మొదటిరోజే తనను 25-26 మంది ఉన్న గదిలో నెట్టివేశారని సందీపా విర్క్ గుర్తుచేసుకున్నారు. నిరంతరం జరిగిన మానసిక వేధింపులు, ఒత్తిడి తట్టుకోలేక తాను జైలులో ఉన్న సమయంలో ఆత్మహత్య చేసుకోవాలని కూడా భావించినట్లు కన్నీటిపర్యంతమయ్యారు.

# మోక్షజ్ఞ బర్త్ డేకి ఫ్యాన్స్‌కి ట్రీట్..

గోపీచంద్ మలినేని దర్శకత్వంలో గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ నటిస్తోన్న ఎన్‌బీకే 111 మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. గత కొంతకాలంగా ఎన్‌బీకే 111 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు తాజాగా టైటిల్ ఖరారు చేశారు. బాలయ్య కుమారుడు నందమూరి మోక్షజ్ఞ తేజ పుట్టినరోజును పురస్కరించుకుని టైటిల్‌ను రివీల్ చేశారు. బాలయ్య - గోపీచంద్ మలినేని మూవీకి దాదా అనే టైటిల్‌ను కన్ఫర్మ్ చేస్తూ మేకర్స్ పోస్టర్ విడుదల చేశారు. దీనికి సంబంధించి పోస్ట్ వైరల్ అవుతోంది. వీరశివారెడ్డి వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత నందమూరి బాలకృష్ణ- గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మూవీ కావడంతో ఎన్‌బీకే 111పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటి వరకు ఈ సినిమాకు టైటిల్ ఏంటన్నది మాత్రం నిర్మాతలు ప్రకటించలేదు. అయితే అభిమానుల ఎదురుచూపులకు తెరదించుతూ.. సెప్టెంబర్ 6వ తేదీన ఎన్‌బీకే 111 టైటిల్‌ను రివీల్ చేశారు. ఈ మేరకు దాదా పేరుతో టైటిల్ గ్లింప్స్ విడుదల చేశారు. బాలయ్య స్టైలిష్‌గా ఎంట్రీ ఇచ్చారు. సూపర్‌స్టార్ కృష్ణ హిట్ మూవీ అగ్నిపర్వతంలోని పాపులర్ డైలాగ్ అగ్గి పెట్టుందా అని అడుగుతూ పూనకాలు తెప్పించారు బాలయ్య. అరేయ్ ఏరే.. నాకు గురిపెట్టడానికి ఒంటిలో పొగరు, వేలికి ట్రిగ్గరు ఉంటే సరిపోదు, బుల్లెట్స్‌కి బలుపుండాలి, గన్స్‌కి గట్స్ ఉండాలి అంటూ తన మార్క్ పంచ్ డైలాగ్‌తో అభిమానులను అలరించారు. దాదాలో బాలయ్య సరసన కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలయ్యను ఢీకొట్టే పవర్‌ఫుల్ విలన్‌గా హీరో మంచు మనోజ్ కనిపించనున్నారు. మిగిలిన నటీనటుల వివరాలు తెలియాల్సి ఉంది. ఇటీవల పెద్దితో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ప్రముఖ నిర్మాత వెంకట సతీశ్ కిలారు తన వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై దాదా సినిమాను నిర్మిస్తున్నారు. బాలయ్య ఫేవరెట్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తుండగా.. కాంతార ఫేమ్ అరవింద్ ఎస్ కశ్యప్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. బుర్రా సాయి మాధవ్ తన మార్క్ పంచ్ డైలాగులను రాస్తున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న దాదా విడుదల కానుందని మేకర్స్ ప్రకటించారు. దాదా సినిమా షూటింగ్ సమయంలో నందమూరి బాలకృష్ణకు గాయం కావడంతో ఆయన ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆయన కోలుకోవడంతో వచ్చే నెల నుంచి షూటింగ్‌ను తిరిగి ప్రారంభించి.. నాన్‌స్టాప్ షెడ్యూల్స్‌తో శరవేగంగా కంప్లీట్ చేయాలని గోపీచంద్ మలినేని భావిస్తున్నారు. షూటింగ్‌కు 2 నెలలే సమయం ఉండటంతో దానికి తగిన విధంగా షూటింగ్ ప్లాన్ చేస్తున్నారని సినీ వర్గాలు తెలిపాయి.



# ఢిల్లీకి వీడ్కోలు

**జాతీయ చలనచిత్ర అవార్డుల వేదికలో కీలక మార్పు**

**దేశవ్యాప్తంగా అవార్డుల నిర్వహణ**

**గుజరాత్‌లో 72వ అవార్డుల వేడుక**

**రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 (చురకలు):** జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవ వేదిక విషయంలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా ఢిల్లీకే పరిమితమైన ఈ ప్రతిష్టాత్మక వేడుకను ఇకపై ప్రతి సంవత్సరం దేశంలోని వేర్వేరు ప్రాంతాలలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని చాటేందుకు ఈ మార్పు చేసినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవాన్ని సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని ఏక్తా నగర్ (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణం) లో వైభవంగా నిర్వహించనున్నారు. సాంప్రదాయబద్ధంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే ఈ వేడుకను ఇతర ప్రాంతానికి మార్చడం ఇదే తొలిసారి. 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా 'ఆర్టికల్ 370', ఉత్తమ నటిగా యామీ గౌతమ్ నిలవగా, మమ్ముట్టి మరియు కార్తీక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుడు పురస్కారాన్ని దక్కించుకున్నారు. అలాగే నాన్-ఫీచర్ విభాగంలో ఆనంద్ ఎల్ రాయ్ ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. సెప్టెంబర్ 22న గుజరాత్‌లో జరగనున్న ఈ ప్రత్యేక వేడుకలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు పురస్కారాలను అందజేయనున్నారు.

# 'ఫౌజీ' సెట్‌లో ప్రమాదం జరగలేదు



ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా 'సీతా రామం' వంటి విజయం తర్వాత హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న సినిమా 'ఫౌజీ' . ఆల్రెడీ విడుదలైన ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. సినిమాపై పాజిటివ్ బజ్ నెలకొంది. అది పక్కన పెడితే... కొన్ని నెలల క్రితం ఈ సినిమా షూటింగ్ చేసేటప్పుడు బాలీవుడ్ నటుడు రాజేష్ శర్మను ఓ కీటకం (విష పురుగు) కుట్టడంతో అనారోగ్యానికి గురి అయ్యారని, ఆయన ఆసుపత్రి పాలయ్యారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. ఆ వార్తల్లో నిజం లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అసలు నిజాలను బయట పెట్టారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రభాస్ సినిమా 'ఫౌజీ' షూటింగ్ పూర్తి చేసుకుని దట్టమైన చెట్ల మధ్య టెక్నీషియన్లతో రాజేష్ శర్మ మాట్లాడుతున్న సమయంలో ఆయన్ను ఓ కీటకం కుట్టిందని జూలై నెలలో బెంగాలీ యాక్టర్ సుదీప ఛటర్జీ తెలిపారు. అప్పట్లో అది పెద్ద సమస్యగా అనిపించలేదని, దాంతో రాజేష్ శర్మ నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. చిత్రీకరణ ముగిసిన ఆరు గంటలకు కాలులో తీవ్రమైన నొప్పి కలగడంతో కోల్‌కతాకు ప్రయాణిస్తున్న విమానంలో రాజేష్ శర్మకు విపరీతమైన జ్వరం వచ్చిందని, పరిస్థితి విషమించడంతో కోల్‌కతాలోని మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించినట్లు సుదీప ఛటర్జీ వివరించారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన ఆరోగ్యంపై జరిగిన ప్రచారాన్ని రాజేష్ శర్మ ఖండించారు. తాను 'ఫౌజీ' సెట్స్‌లో అనారోగ్యానికి గురైనట్లు వచ్చిన వార్తల్లో అసలు నిజం లేదని ఆయన తెలిపారు. ఆ అంశం గురించి రాజేష్ శర్మ మాట్లాడుతూ... "అది ముమ్మాటికీ అబద్ధమే. ప్రభాస్ 'ఫౌజీ' సినిమా సెట్స్‌లో నాకు ఏం జరగలేదు. నేను అనారోగ్యానికి గురి కావడం వెనుక ప్రభాస్ కానీ, ఆయన సినిమా యూనిట్ కానీ ఎంత మాత్రం బాధ్యులు కారు. వాళ్ళందరూ మంచి వ్యక్తులు" అని చెప్పారు. హైదరాబాద్‌లో షూటింగ్ చేసిన సమయంలో తనకు ఎటువంటి ఇబ్బంది తలెత్తలేదని, కోల్‌కతాకు వచ్చిన ఒకట్రెండు రోజుల తర్వాతే పరిస్థితి విషమించిందని... తీవ్రంగా మారిందని రాజేష్ శర్మ వివరించారు. తాను అనారోగ్యానికి గురి కావడానికి అసలు కారణం పురుగు కుట్టడం కాదని, తన కుడి కాలును చాలా కాలంగా ఇబ్బంది పెడుతున్న చర్మ సంబంధిత సమస్య అని, దాని కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకిందని రాజేష్ శర్మ వెల్లడించారు. తనకు షుగర్ (డయాబెటిస్) ఎక్కువగా ఉండటం, సమస్యను ప్రారంభంలో పట్టించుకోకపోవడం వల్ల ఇన్‌ఫెక్షన్ మరింత ఎక్కువైందని ఆయన వివరించారు. సుదీప తనకు ఫ్రెండ్ అని, తప్పుడు సమాచారం అందడంతో అలా చెప్పారని పేర్కొన్నారు. అదీ సంగతి. ప్రస్తుతం తాను కోలుకుంటున్నానని రాజేష్ శర్మ తెలిపారు. మరో వారంలో తిరిగి షూటింగ్లు చేయడం స్టార్ట్ చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com